
మహిళా మాసపత్రిక

# అనుపమ

రబీ ఉస్సాని - జమాది ఉల్ అవ్వల్ 1446 హిజ్రీ | నవంబర్ 2024 ₹ 15/-




## మణిపూర్ మంటల్ని ఆర్పే బాధ్యత ఎవరిది?




## కోటలు చెప్పే చరిత్ర



## మహిళా రక్షణకై మనోవేదన

మహిళా మాసపత్రిక

# అనుపమ

నిజస్థానం చూపే కరదీపిక

సంపుటి : 13 సంచిక: 11

నవంబర్ 2024 వెల: రు.15



చీఫ్ ఎడిటర్
**ఎస్.ఎమ్. మలిక్**

ఎడిటోరియల్ టీమ్
**తాహెరా బేగం**
**షహనాజ్ బేగం**
**షహ్నాజ్ ఏజాజ్**

ఎగ్జిక్యూటివ్స్
**సమీనా**
**ఫాతిమా**



**చందాలు, అభిప్రాయాలు పంపవలసిన చిరునామా**

anupama
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24576237
E-Mail: anupamamonthly@gmail.com

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్ - 9704317015**





## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| హస్తభూషణం | ...... | 04 |
| మణిపూర్ మంటల్ని ఆర్పే బాధ్యత ఎవరిది? | ...... | 05 |
| మహిళా సాధికారత | ...... | 08 |
| బయట ఒకలా... లోపల మరోలా | ...... | 10 |
| కోటలు చెప్పే చరిత్ర | ...... | 12 |
| మీ ఆరోగ్యం మీ "చేతుల్లో" | ...... | 14 |
| మహిళా రక్షణకై మనోవేదన | ...... | 18 |
| బాలల దినోత్సవం | ...... | 20 |
| నమ్మక ద్రోహం | ...... | 24 |
| రతన్ నావల్ టాటా | ...... | 26 |
| మతం గొడుగెందుకు రాజకీయాలకు? | ...... | 28 |
| స్త్రీ సాక్ష్యం | ...... | 30 |
| నైతికతే నిజమైన స్వేచ్ఛ | ...... | 33 |
| వంటలు | ...... | 34 |


**ఇక చదవండి ....**

# హస్తభూషణం

హైడ్రా- హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీని జులై 19న జీవో నంబర్ 99 ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది స్వయం ప్రతిపత్తి గల సంస్థ.

దశాబ్దాల తరబడి విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలను, పరపతి ఉన్న వ్యక్తులు ఆక్రమించి వెనువెంటనే నిర్మాణ అనుమతులు పొందడం చకచకా జరిగిపోతుంది. నిబంధనలకు వ్యతిరేకంగా పరపతి గల వారు ప్రభుత్వ అనుమతులతో అతిపెద్ద ఫంక్షన్‌హాళ్ళను, ఫామ్ హౌజ్‌లను, ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లను నిర్మించారు. హైడ్రా ఒత్తిడిలన్నింటినీ అధిగమిస్తూ అక్రమ కట్టడాలను నేలమట్టం చేయడం సాహసోపేత నిర్ణయం. హైడ్రాకు ప్రజల మద్దతు కూడా లభించింది.

హైడా తన విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్‌లో మంచినీటి చెరువులైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లతోపాటు నీటి వనరులు చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించింది.  ఇప్పుడు  హైడ్రా అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు బడా పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు హడలెత్తిపోతున్నారు.అనుమతులు జరుగుతున్న ప్రాంతాల్లో ల్యాండ్ సర్వే శాఖ రెవెన్యూ శాఖలు సంయుక్తంగా చెరువులు, కుంటలు, నాలాలను గుర్తించి వాటికి హద్దులు నిర్ణయించాలని ఆదేశాలున్నా అధికారులు కొనుగోలు దారులు అవేమీ పట్టించుకోలేదు.

జాతీయ, రాష్ట్ర రహదారుల విస్తరణ కొత్త జిల్లాల ఏర్పాటుతో తెలంగాణలోని పట్టణ ప్రాంతాలలో, గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో భూ కబ్జాదారులు ఆక్రమణకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములు అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు చివరికి శ్మశాన వాటికలను ఆక్రమించుకుని అధికారులను ప్రలోభపెట్టి ప్రజలకు లక్షలు, కోట్లలో విక్రయిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ సమయంలో భూమి పత్రాలను చూసి ఆయా స్థలాల సర్వేనంబర్ సరైనదేనా? అది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? బఫర్ జోన్‌లో ఉందా? అనే విషయాలను సంబంధిత రిజిస్ట్రేషన్, రెవెన్యూ, మునిసిపాలిటీ వాళ్ళు ఇరిగేషన్ అధికారులు నిర్ధారించిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోని అధికారులు రాబడే లక్ష్యంగా ఆక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేయడంతో సామాన్య ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు మార్చడంతో సామాన్య ప్రజలు భయాందోళనలలో జీవనాన్ని వెళ్ళదీస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు జీవితాంతం కూడబెట్టిన డబ్బుతో ఇళ్లు,  అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసిన తర్వాత హైడ్రా కబళిస్తే పేద ప్రజల పరిస్థితి ఏమిటి?

అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజా భాగస్వామ్యం ఉంటుందని హైడ్రా విషయంలో స్పష్టమైంది. పేద ప్రజలకు నష్టం వాటిల్లకుండా నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత.

**కవరు కథనం**

షహనాజ్ బేగం









**ప్రకృతి వనరులు కొండలు, గుట్టలు పచ్చని వృక్ష సంపదతో కళకళలాడే మణిపూర్ రాష్ట్రం జాతుల పోరాటంతో అగ్నిగుండంగా మారింది. ధన, మాన, ప్రాణనష్టం యధేచ్ఛగా సాగుతోంది. విద్యార్థులు సైతం ఆయుధాలు చేపట్టడం శోచనీయం. మైదాన మెయితీ, కొండ ప్రాంత కుకీలకు మధ్య యుద్ధ వాతావరణం తాండవిస్తుంది. బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ మౌనం వహించింది.**

గత 18 నెలలుగా మణిపూర్ మండుతోంది. జన జీవనం స్తంభించి పోయింది. పాఠశాలలు, యూనివర్సిటీలు మూసివేయబడ్డాయి. మణిపూర్‌లో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని భయాందోళనల మధ్య ప్రజలు జీవిస్తున్నారు. రాష్ట్ర మధ్య భాగంలో ఉండే మైదాన ప్రాంతంలో మెయితీలు జనాభాలో 53శాతం ఉంటారు. రాష్ట్ర 60 అసెంబ్లీ సీట్లలో 40 సీట్లు మెయితీ జాతి ప్రజలు కైవసం చేసుకుంటారు. మైదాన ప్రాంతం చుట్టూ కొండలు, గుట్టలు ఉన్నాయి. ఇక్కడ అనేక గిరిజన తెగలు 47 శాతం ఉన్నాయి. ప్రధానంగా కుకీ, జో, నాగలు రాష్ట్ర జనాభాలో అధిక సంఖ్యలో ఉంటారు. వీరిలో చాలామంది క్రైస్తవులు అసెంబ్లీలో వీరికి 20 సీట్లు లభిస్తాయి.

మెయితీలు మైదాన ప్రాంతంలో ఉండటం వల్ల అభివృద్ధి చెందారు. నగర జీవన విధానం ఇక్కడ కనిపిస్తుంది. కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు అభివృద్ధికి దూరంగా తరాలుగా సంక్రమించిన సంస్కృతిని కాపాడుకోవటానికి ప్రాధాన్యమిస్తారు. తమ విలక్షణమైన వ్యక్తిత్వం, భాష జీవన విధానంలో వీరు మార్పును ఆశించరు. గిరిజనుల ప్రత్యేక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం మైదాన మెయితీలకు ఎస్టీ హోదాలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు గిరిజనులు ఆవేశానికి, అభద్రతకు

గురయ్యారు. తిరగబడ్డారు. మైదాన మెయితీలు ఎస్టీ హోదాతో గిరిజనుల భూములను కొనుగోలు చేయవచ్చు. ఇది గిరిజనులకు సుతరామూ ఇష్టం లేదు. ఇది ఆదివాసీల హక్కులను కాలరాయడమే. ఆదివాసీలు తమ సంస్కృతి, భాష, యాస, జీవన వనరులను ప్రాణప్రదంగా ప్రేమిస్తారు. వాటిని కాపాడుకుంటారు.

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం కుకీలకు వ్యతిరేకంగా బాహాటంగా నిర్ణయాలు తీసుకుంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి బీరాన్ సింగ్ మెయితీ వర్గానికి చెందినవారు. అనేక సందర్భాలలో కుకీలకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మెయితీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. మైదాన నాగరిక జీవనం కలిగిన మెయితీలకు గిరిజన గుర్తింపు ఇవ్వద్దన్న డిమాండ్‌తో వీధుల్లో నిరసన ప్రదర్శనలు జరిపిన కుకీలపైన రాష్ట్ర ప్రభుత్వం అణిచివేసే ప్రయత్నాలు చేసింది. 18 నెలల క్రితం కుకీ గ్రామాలపైన, మహిళలపైన అల్లరి మూకలు సభ్యసమాజం తలదించుకునేంత అమానవీయంగా హత్యలకు, మూకుమ్మడి అత్యాచారాలకు, దాడులకు, దహనాలకు విచ్చలవిడిగా పాల్పడినా బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు. బాధిత మహిళలు, పురుషులూ పోలీసుల శరణు కోరినా రక్షణ లభించలేదు. ఎలాంటి ఆటంకం లేకుండా బాధాకరమైన, క్రూరమైన ఘటనలు మణిపూర్‌లో నిరాఘాటంగా జరుగుతున్నాయి.

గత 34 సంవత్సరాలుగా మైదాన ప్రాంత మెయితీలు ముఖ్యమంత్రులుగా మణిపూర్‌లో ఎన్నుకోబడుతున్నారు. ఇది గిరిజన జోనాగాలలో పెరుగుతున్న అసమ్మతికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు. రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి పథకాలలో అధిక శాతం మెయితీలు గల ఇంపాల్ లోయకే పరిమితం అవుతున్నాయని గిరిజనులు ఆరోపిస్తున్నారు. అధికారం, అభివృద్ధి, వనరుల పంపిణీలో అసమతుల్యం, పక్షపాతం ఇవి మణిపూర్ వివాదానికి ప్రధాన కారణాలు. గిరిజనులు అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి అనేక ఉద్యమాలను చేపట్టారు. ప్రభుత్వాలు ఆదివాసులను అణిచివేస్తూనే వచ్చాయి. జాతుల మధ్య అంతర్గత కలహాలను రెచ్చగొడుతున్నారు. మణిపూర్‌లో గతేడాది నుండి ఇప్పటివరకు 230 మందికిపైగా మృతి చెందారు. వేలల్లో గాయపడ్డారు. 67వేల మంది నిరాశ్రయులయ్యారు. 32 మంది ఆచూకీ తెలియడంలేదు. 4786 ఇళ్లు దగ్ధమయ్యాయి. 386 మతపరమైన నిర్మాణాలు నేలమట్టమయ్యాయి. మహిళలపై లైంగిక దాడులు మూకుమ్మడిగా జరుగుతున్నాయి. సర్వస్వం కోల్పోయిన వేలాది మంది సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ప్రజలు రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్తున్నారు. విద్వేష మూకల దాడుల కారణంగా యూనివర్సిటీలు ఖాళీ అయ్యాయి. అల్లర్లలో ఆచూకీ లేకుండాపోయిన వారి గురించి కుటుంబ సభ్యులకు ఇంత వరకు ఏ సమాచారమూ లేదు. ఆగస్ట్ నెలలో జిరిబామ్ జిల్లా కేంద్రంలో వివిధ సంస్థల ప్రతినిధుల సమావేశం జరిగింది. దీనిలో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నారు. జిరిబామ్ జిల్లా వెలుపల ఉన్న అనేక గిరిజన సంస్థలు మాకు ఎటువంటి సమాచారం లేదని ఒప్పందాన్ని ఖండించాయి. సెప్టెంబర్ 1న కొన్ని గ్రామా లపై డ్రోన్లతో దాడులు జరపటంతో మణిపూర్‌లో మళ్ళీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనుమానిత మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో ఒక మహిళతో సహా ఇద్దరు వ్యక్తులు మరణించారు. తొమ్మిది మంది గాయపడ్డారు. మణిపూర్ మరోసారి భగ్గుమంది. సెప్టెంబర్ 1 నుండి విద్యార్థులు ఆందోళనలు తీవ్రతరం చేశారు. దీంతో రెండు వేల మంది సీఆర్‌పిఎఫ్ సిబ్బందిని కేంద్రం మణి పూర్‌కు పంపించింది. వారం రోజుల్లో 12 మంది మరణించారు. వేల మంది గాయపడ్డారు. పరస్పర విశ్వాసం కోల్పోయిన జాతుల మధ్య సయోధ్య కుదర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాల్సిందిపోయి సాయుధ బలగాలను అధికంగా పంపడంతో మరింతగా హింస ప్రబలుతోంది. సాయుధ గ్రూపుల మధ్య కాల్పులు జరగడంతో ప్రజలు చనిపోతున్నారు. స్థానికులు రాత్రిపూట కూడా టార్చిలైట్లు పట్టుకొని నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రదర్శకులపైన పోలీసులు విచ్చలవిడిగా లాఠీచార్జి చేసి బాష్ప వాయువు గోళాలను ప్రయోగించారు. హింసను నియంత్రించడంలో విఫలమైనందుకు గాను ఉన్నతాధికారులు ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయడానికి సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ విద్యార్థి ప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు.

అసోం రైఫిల్స్ బెటాలియన్స్‌ను వారి స్వస్థలాలకు పంపాలని వారితో భద్రత క్షీణిస్తుందని కాంగ్‌పోక్పి అనే మరో గ్రూపు ఆందోళనలు చేసింది. అసోం రైఫిల్స్ బెటాలియన్‌కు చెందినవారికి మణిపూర్ ప్రజల గురించి భౌగోళిక పరిస్థితుల గురించి పూర్తి అవగాహన ఉంది. గిరిజన కుకీ జో తెగలు వీరిని పూర్తిగా విశ్వసిస్తాయి. వీరి ప్రాబల్యం తగ్గి సిఆర్‌పిఎఫ్ ప్రాబల్యం పెరగడంతో ఆదివాసుల్లో ఆగ్రహం అసంతృప్తి తారస్థాయికి చేరింది. ప్రస్తుతం హింసాత్మక ఘటనలు కొత్త పుంతలు తొక్కాయి. జాతుల మధ్య పోరాటంలో డ్రోన్‌లు రాకెట్ బాంబు దాడులు జరుగుతున్నాయి. దీంతో గ్రామాలకు గ్రామాలు తుడుచుకు పెట్టుకుపోయే అవకాశం ఉంది. పలు జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ నిలిపివేశారు. పాఠశాలలు మూసివేశారు. కుకీ యువకులు, విద్యార్థులు తమకు ప్రత్యేక పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి పాలనను అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో ప్రెస్‌మీట్‌లు, ఇంటర్నెట్ బ్రాడ్

బాండ్‌పై నిషేధం విధించింది రాష్ట్ర ప్రభుత్వం. రాజధానిలో విధించిన కర్ఫ్యూను ధిక్కరించడంతో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. కుకీ జో నిరసనకారులను మెయితీలు అధికంగా ఉండే ప్రాంతంలో పోలీసులు లాఠీచార్జీ చేసి ప్రదర్శకులను చెల్లాచెదురు చేశారు. కాంగ్‌పోక్పి జిల్లాలో మాజీ హవాల్దార్ లింకోలాయ్ మేట్‌సెక శవమై పడి ఉన్నాడని టెలిగ్రాఫ్ వార్తా పత్రిక తెలియజేసింది. హవల్దార్ తన స్నేహితుడిని విడిచిపెట్టేందుకు బయటకు వచ్చినప్పుడు మెయితీలు నివసించే ప్రాంతాల నుండి తిరిగి వస్తున్నప్పుడు పోలీసులు తీవ్రంగా కొట్టి గాయపర్చారు. అతను ప్రాణాలు వదిలాడు. హవల్దార్ చనిపోవడంపై కుకీ మెయితీ తెగల మధ్య ఘర్షణలు రేగాయి. ఇరుపక్షాల మధ్య హింస పెరగడంతో కుకీలు నివసించే ప్రాంతానికి మెయితీలు, మెయితీలు నివసించే ప్రాంతానికి కుకీలు రావడానికి వీలు లేకుండా ఆంక్షలు విధించుకున్నారు. హవల్దార్ కుమారుడు కాంగ్‌పోక్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐ ఆర్ నమోదు చేశారు. సెప్టెంబర్ 10న మణిపూర్ సచివాలయం రాజ్‌భవన్ ముందు వేలాది మంది విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. ఇటీవల డ్రోన్లు, రాకెట్ మిసైల్‌ల ద్వారా దాడులు జరి పిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాంతిభద్రత లను కాపాడేందుకు ముమ్మరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. క్షిపణి దాడులకు వ్యతిరేకంగా విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. రాజ్‌భవన్ ఎదుట బైఠా యించి నిరసన ర్యాలీ జరుపుతుండగా ఇంఫాల్‌లో పోలీసులకు విద్యార్థులకు మధ్య ఘర్షణలు జరిగాయి. 50 మంది విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఒక యువతి పరిస్థితి సరిగా లేదని మెరుగైన చికిత్స కోసం ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్చారు. మణిపూర్ యూనివర్సిటీ విద్యార్థులు వీధుల్లో నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర భద్రతా సలహాదారు పోలీసు డీజీపీ భద్రతను కాపాడటంలో విఫలమైనందున డిజిపి పదవి నుండి తప్పించా లని విద్యార్థులు డిమాండ్ చేశారు. పరిస్థితి దిగజారు తున్న దృష్ట్యా కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ 2వేల మంది సిఆర్‌పిఎఫ్ దళాలను అదనంగా రాష్ట్రానికి పంపించింది.

బిజెపి పాలిత మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణ వ్యవహారా లను కేంద్ర హెూంశాఖ ఆధ్వర్యంలో యూనిఫైడ్ కమాండ్ పర్య వేక్షిస్తుంది. అల్లర్ల నేపథ్యంలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ గవ ర్నర్‌ను కలిసి యూనిఫైడ్ కమాండ్‌ను తనకు అప్పగించాలంటూ విన్నవించుకున్నారు. హెూం మంత్రి అమిత్‌షా దానికి మేము సుముఖంగా లేమని ప్రకటించాడు. స్థానిక ఎమ్మెల్యే సీఎం బిరేన్ సింగ్ అల్లుడు రాజ్‌కుమార్ ఇమో సింగ్ కేంద్రం బలగాలను మోహరించినా ఫలితమేమీలేదని కేంద్ర హెూం మంత్రికి ఉత్తరం రాశారు. సంవత్సరం పైగా చదువులకు నోచుకోని విద్యార్థులు యూనిఫాం ధరించి వీధుల్లోకి వచ్చారు. శాంతి భద్రతలను కాపాడి చదువులను కొనసాగించవలసిందిగా కోరారు. నిరసన ప్రద ర్శనలో హెూం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను తగులబెట్టారు. మణిపూర్ నుండి పారా మిలిటరీ బలగాలను ఉపసంహరించా లని ఇంఫాల్‌లో మీనమేషాలు లెక్కించుకుంటుకున్న 50 మంది ఎమ్మెల్యేలు 10 మంది కుకీ జో ఎమ్మెల్యేలు నైతిక కారణాలతో రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

బిజెపి ప్రభుత్వం మెయితీ దురభిమానాన్ని ప్రోత్సహిస్తున్నది. జాతుల మధ్య వైరం ప్రజలు ప్రభుత్వం మధ్య అగాథం సృష్టిం చబడింది. సిఎం బీరేన్‌సింగ్ రహస్య ఆడియో టేపులు బహిర్గత మయ్యాయి. దీంతో సంక్షోభం మరింత ముదిరింది. ఒక గ్రామంపై డ్రోన్‌లతో జరిగిన బాంబు దాడుల వెనుక ముఖ్య మంత్రి బీరేన్‌సింగ్ మద్దతుదారులున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రధానమంత్రి నిష్క్రియా పర్వతం దీర్ఘకాల మౌన ముద్రతో మణి పూర్ మండుతోంది. బయటకు వచ్చిన ఆడియో టేపులను అల్లర్లపై దర్యాప్తు జరుపుతున్న విచారణ కమిషన్‌కు సమర్పిం చారు.

మతపరమైన బహుళత్వం మణిపూర్ విశిష్ట లక్షణమే కాదు భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ విశిష్టత. ఆదివాసుల హక్కు లను గౌరవించాలి. పాలక వర్గాలు అప్రజాస్వామికంగా ఆధిపత్య ధోరణి, అణచివేతలు గిరిజన జాతులకు జీవన్మరణ సమస్యగా పరిణమించింది. మణిపూర్ శాంతిభద్రతల కోసం పాలకులు తగిన చర్యలు చేపట్టాలి.

మణిపూర్ యంపి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ బిమోల్ అకోయిజామ్ ప్రసంగం సమాజానికి కన్నీరు తెప్పిస్తుంది. “మీ గుండెల మీద చేయివేసుకుని మణిపూర్‌లో నిరాశ్రయులైన వారి గురించి వారి తల్లులు పిల్లలు భర్తలను పోగొట్టుకున్న మహిళల గురించి ఆలోచించండి. ఆ తర్వాత చర్యలకు ఉపక్రమించండి. అక్కడ ఆయుధాలు చేతబట్టి తమ గ్రామాలను కాపాడుకునేందుకు యుద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏడాదిగా కొనసాగుతున్న ఈ హింసాకాండను చేష్టలుడిగి తిలకిస్తున్నది” అంటూ చేసిన ఆవేదనా భరిత ప్రసంగం పాలకు లకు కనువిప్పు కావాలి.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం గోది మీడియా మణిపూర్ వార్తలను ప్రపంచానికి దాచి పెట్టినా సోషల్ మీడియా ద్వారా వార్తలు బయటికి వస్తున్నాయి. మణిపూర్‌లో శాంతిభద్రతలు ప్రజల సమైక్య జీవనానికి చాలా అవసరం. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. ఈ ప్రత్యేకతను కాపాడుకోవాలి. ✤






# మహిళా సాధికారత

సమీనా సలీం

ఆడవాళ్లను అండర్ ఎస్టిమేట్ చేస్తున్నారు- అనేది సమాజంలో ఇప్పటికీ ఒక సాధారణ భావన. అయితే, రతన్ టాటా గారు ఈ అభిప్రాయాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ఆయన ఒక విజ్ఞానవంత వ్యాపారవేత్త మాత్రమే కాకుండా, సమాజ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశారు. ముఖ్యంగా మహిళల సాధికారత కోసం ఆయన చేసిన కృషి రేపటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

రతన్ టాటా గారు, టాటా సంస్థ ద్వారా మహిళలకు విస్తృతంగా అవకాశాలను కల్పించారు. ఆటోమొబైల్ రంగంలో మహిళలు సరిగా పని చేయలేరనే అభిప్రాయానికి భిన్నంగా టాటా మోటార్స్ పూణే ప్లాంట్‌లో 1500 మంది మహిళలు పురుషుల సహకారం లేకుండా వాహనాలను తయారు చేస్తున్నారు. ఒక షిఫ్ట్‌లో 100కి పైగా వాహనాలను తయారు చేయడం ద్వారా వారి సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు "కౌసల్య" పేరుతో "ఎర్న్ అండ్ లెర్న్" ప్రోగ్రామ్ ప్రవేశపెట్టారు, ఇందులో ఐటీఐ లేదా ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిలకు మూడేళ్ల డిప్లొమా ప్రోగ్రామ్, వర్క్‌షాప్‌లో శిక్షణ మరియు స్టైఫండ్ అందిస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక వారికి ఉద్యోగాలు చూపిస్తున్నారు.

## రతన్ టాటా గారి దృష్టిలో మహిళా సాధికారత

రతన్ టాటా గారి అభిప్రాయం ప్రకారం, "మహిళలకు అవకాశాలు ఇవ్వడం అంటే కేవలం భద్రత కల్పించడమే కాకుండా, ఆర్థిక స్వాతంత్ర్యం, స్వీయ గౌరవం కూడా అవసరం." ఆయన చేసిన కృషి భారతదేశంలోని లక్షలాది మహిళలకు పునాదిగా నిలిచింది. మహిళల విద్యపై ఆయన చూపిన శ్రద్ధ అనేక జీవితాలను ప్రభావితం చేసింది. టాటా ట్రస్ట్స్ ద్వారా ప్రవేశపెట్టిన స్కాలర్‌షిప్‌లు, విద్యా కార్యక్రమాలు మహిళలకు విద్యా సాధనలో తోడ్పడ్డాయి.

2002లో ప్రారంభించిన "ఒఖాయ్" ప్రాజెక్ట్ ద్వారా గుజరాత్ గ్రామీణ ప్రాంత మహిళలు తమ సంప్రదాయ హస్తకళలను ప్రపంచానికి పరిచయం చేసి, ఆర్థిక స్వాతంత్రం పొందే అవకాశం కల్పించారు. అలాగే, "సాథి ప్యాడ్స్" అనే బయో డిగ్రేడబుల్ సానిటరీ ప్యాడ్స్ ప్రాజెక్ట్ ద్వారా పేద గ్రామీణ ప్రాంత మహిళలకు తక్కువ ధరలో హైజీన్ ఉత్పత్తులు అందించారు.

## TCS, మహిళలకు అవకాశాలు

రతన్ టాటా గారి నాయకత్వంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) వంటి సంస్థలు Second Career Initiative (SCI)

అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయి. ఈ కార్యక్రమం కెరీర్‌లో విరామం తీసుకున్న మహిళలకు తిరిగి అవకాశాలు అందించ డమే లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా గర్భవతులు, తల్లులు, లేదా వ్యక్తిగత కారణాలతో ఉద్యోగ విరామం తీసుకున్న మహిళలు, ఆధునిక టెక్నాలజీలలో శిక్షణ పొంది, పరిశ్రమలో తిరిగి ప్రవేశించేలా మార్గం సుగమం చేశారు.

### సామాజిక సేవలు, మహిళా సాధికారత

రతన్ టాటా పరోపకార కార్యక్రమాలు మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషించాయి. గ్రామీణ ప్రాంత మహిళల కోసం టాటా ట్రస్ట్ ద్వారా ప్రారంభించిన అనేక ఉపాధి, ఆరోగ్య కార్యక్రమాలు, మహిళల అభ్యున్నతికి దోహద పడ్డాయి. పేద గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేం దుకు, స్వయం సహాయ సంఘాలకు ఆర్థిక మద్దతు, నైపుణ్య శిక్షణ అందించారు.

మహిళా ఆరోగ్యం విషయంలో కూడా రతన్ టాటా ప్రత్యేక శ్రద్ధ చూపారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించి, తక్కువ ఖర్చులో పరీక్షలు అందిం చారు. ఈ కార్యక్రమాలతో మహిళలను ఆరోగ్య పరిరక్షణలో ముందడుగు వేయించారు.

### మహిళలకు ప్రాధాన్యత, సమానత్వం

రతన్ టాటా మహిళలను తక్కువ అంచనా వేయడం, సమాజంలో వారి పాత్రను చిన్నచూపు చూడడం గురించి అనేక సందర్భాల్లో మాట్లాడారు. ''మహి ళలు సమాజంలో తక్కువ అంచనా వేయబడుతున్నా, వారు చేసిన కృషి సమాజాన్ని మార్చ గల సామర్థ్యం కలిగి ఉంది'' అని ఆయన పేర్కొ న్నారు. టాటా గ్రూప్‌లో డైవర్సిటీ, సమానత్వం, చేర్చుకొనివేత (Inclusion) కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లి, ప్రతి ఒక్కరికీ సమాన అవ కాశాలు కల్పించారు.

### నానో కారు మరియు రతన్ టాటా ఆశయం

రతన్ టాటా సామాన్యుల కోసం రూపొందించిన నానో కార్ కూడా సామాజిక సేవలో ఒక విశేషంగా నిలిచింది. ద్విచక్ర వాహనాలు కొనలేని కుటుంబాలు కూడా తక్కువ ధరలో కారు కొనగలరన్న ఆశయంతోనే నానో కార్ తయారు చేశారు. ఇది మార్కెట్‌లో అనుకున్న స్థాయిలో విజయం సాధిం చకపోయినా, వారి దృష్టి సామాన్యులకు ప్రయోజనం చేకూర్చ డమే అని స్పష్టమైంది.

### సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే...

రతన్ టాటా అభిప్రాయంలో, ''వేగంగా ప్రయాణం చేయా లంటే ఒంటరిగా ప్రయాణించాలి. కానీ సుదూరం ప్రయాణించా లంటే అందరితో కలిసి ప్రయాణించాలి'' అని చెప్పేవారు. ఈ మాటలు మహిళా సాధికారతకు తగిన ప్రేరణనిచ్చాయి.

రతన్ టాటా మహిళా సాధికారతకు సంబంధించిన కృషి సామాజిక మార్పులకు ఒక స్పష్టమైన మార్గదర్శకంగా నిలు స్తోంది. మహిళలను తక్కువ అంచనా వేయడం కాకుండా, వారికి సమాన అవకాశాలు, స్వతంత్రత, గౌరవం కల్పించడంలో ఆయన చూపిన ప్రణాళికలు, ఎన్నో జీవితాలను సరికొత్తగా తీర్చిదిద్దాయి.

ఆటోమొబైల్ రంగంలో మహిళలకు టాటా సంస్థ కల్పించిన అవకాశాలు, టీసీఎస్ ద్వారా కెరీర్ విరామం తీసుకున్న మహిళ లకు కొత్త అవకాశాలు ఇవ్వడం, మరియు మహిళల ఆరోగ్యం, ఉపాధి, విద్యా అభివృద్ధికి టాటా ట్రస్ట్ చేసిన విప్లవాత్మక కార్య క్రమాలు- ఇవన్నీ మహిళల శక్తిని సమాజానికి చాటిచెప్పాయి.

రతన్ టాటా ప్రవేశపెట్టిన ఈ మార్గం రాబోయే తరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తూ, సమానత్వం, గౌరవం, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి మూల్యాలపై మనం ఎంతగా దృష్టిపెట్టాలో నిరూపిస్తోంది. ''మహిళల సాధికారతలోనే సమాజం ఎదగడానికి నిజమైన మార్గం ఉంది'' అనే ఆయన ఆలోచన భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా నిలుస్తుంది. ✤


చందా వివరాలు

అనుపమ

మహిళా మాసపత్రిక

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15 |
| వార్షిక చందా | రూ.150 |
| విదేశాలకు వార్షిక చందా | రూ.1000 |

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా పంపవచ్చు. డి.డి. ద్వారా పంపదలిస్తే డి.డి.ని **anupama** పేర మాత్రమే తీయాలి.

అనుపమ బ్యాంక్ అకౌంట్ వివరాలు:

**Anupama, Central Bank of India, Noorkhan Branch, A/c. No.3309747713, IFSC No.CBIN0281502**

**anupama monthly**

Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar, Hyderabad-500 002. Ph: 040-24564583



# బయట ఒకలా... లోపల మరోలా

తస్నీమ్‌జహాన్ ఖాన్

ఒక మనిషి మంచి వాడా? చెడ్డవాడా అనేది అతని నైతిక విలువల ఆధారంగా గుర్తించబడతాడు. నైతికంగా మంచి లక్షణాలను పుణికిపుచ్చుకున్నవారికి సమాజంలో ఎంతో గౌరవం లభిస్తుంది. అలాగే నైతికంగా దిగజారిన వారిని సమాజం నీచంగా చూస్తుంది. మనలో చాలామంది సమాజం ముందు ఎంతో మంచివారిలా గుర్తింపు పొందడానికి నటిస్తూ ఉంటారు. కాని వారు అంతర్గ తంగా, వారి ఇంట్లో వారి నైతికత దిగజారి ఉంటుంది. పరుల మెప్పు కోసం మంచివారిలా నటిస్తూ ఇంట్లో వాళ్ళకి మాత్రం నరకం చూపిస్తూ ద్వంద్వ వైఖరి గల కపటులు చాలా మందే మన చుట్టూ ఉన్నారు. ఇలాంటి కపటుల నైతిక స్థితిని గురించి చర్చిద్దాం.

### గృహ హింస

సుగుణ సంపన్నుడు, నోట్లో నాలుక లేనివాడు, చీమకైనా హాని కలుగజెయ్యని అహింసాత్ముడు.. అంటూ పెళ్ళికి ముందు అమ్మాయి తరపున వారు ఎంక్వైరీ చేసిన వారికి ఆ ఊరు,వాడ వారు ఆ అబ్బాయికి ఇచ్చిన కండక్ట్ సర్టిఫికెట్ లాంటి మాటలు. ఊళ్ళో వాళ్ళు ఎంతో మంచిగా చెబుతున్నారు కదా అని నమ్మి ఆ అబ్బాయికిచ్చి పెళ్ళి చేశారు. కొన్ని రోజుల్లోనే అతనిలోని శాడిజం బయటపడింది. ఒక్కటే అనుమానం. ఆ అమ్మాయిని నిలువనివ్వడు, కూర్చొనివ్వడు. బానిస కంటే హీనంగా చూస్తుం టాడు. అత్తింటి వారంటే గిట్టదు. వారి ముందు పొగరుగా విర్రవీగుతుంటాడు. బయట ఎవరేమన్నా ఇంటికొచ్చి భార్యపై కోపం ప్రదర్శించి ఆమెను శారీరకంగా, మానసికంగా చిత్ర హింసలు చేస్తుంటాడు. ఆమె అన్నీ మౌనంగా భరించాలి. ఎవరికీ అతని శాడిజాన్ని గురించి చెప్పకూడదు. చెప్తే ఇంకా రెచ్చిపోయి పదింతలు ఎక్కువగా టార్చర్ పెడతాడు. భార్య నోరు మూసు కుని అన్నీ భరించాలి. దీనంతటినీ రివర్స్ చేసుకుని అమ్మాయి చేసే గృహహింసను కూడా మనం చెప్పుకోవచ్చు. భర్తను పట్టించు

కోదు. భర్త తరపున వారంటే అస్సలు గిట్టదు. వృధా ఖర్చులు, లెక్కలేనితనం, ఇంటి పట్టాన ఉండదు.పిల్లల్ని సరిగ్గా పట్టించుకోదు. భర్తపై లేనిపోని అనుమానాలు, అకారణంగా ప్రతి విషయాన్ని పెద్దది చేసి గొడవ చేయటం, ఇంట్లో శాంతి కరువవటం...

ఇంట్లో వాతావరణం ఎంత భయంకరంగా ఉన్నా కూడా భార్యాభర్తలు ఎంతో అన్యోన్యంగా ఉంటున్నట్టు ఫొటోలు, సెల్ఫీలు సోషల్ మీడియాలో పెట్టి అమర ప్రేమికులన్నట్లు అందరి ముందూ నటిస్తూ ఉంటారు. వాళ్ళు చేస్తున్న గృహ హింసలు కప్పిపుచ్చుకునేందుకు, వారిలోని శాడిజాన్ని కవర్ చేస్తూ లవ్ కొటేషన్లు, లవ్ సాంగ్స్ పెట్టి వాళ్ళకంటే గొప్ప లవ్ బర్డ్స్ ప్రపంచంలోనే లేరన్నట్లుగా బిల్డప్ ఇస్తుంటారు.

ఫ్యామిలీ లైఫ్‌లో ప్రేమాభిమానాలు, క్షమాగుణం, సహాయ సహకారాలు, నిజాయితీ, బాధ్యతాయుత దృక్పథం, ఆదరణ, కేరింగ్ వంటి నైతిక విలువలు పుష్కలంగా కనబరచాల్సి ఉంటుంది. అప్పుడే ఆ ఇల్లు హరివిల్లు అవుతుంది. లేకపోతే పైపై మెరుగులు తప్ప మనశ్శాంతి ఉండదు. భార్యాభర్తలిద్దరూ ఉన్నత నైతిక విలువలను పాటించాల్సిందే! 'దేవుని' దృష్టిలో మంచివారిగా గుర్తించబడాలి. దైవప్రవక్త(స) ప్రవచనం: ''తన భార్యాపిల్లల విషయంలో మంచివాడే మీలో మంచివాడు. నేను కూడా నా భార్యాపిల్లల విషయంలో మంచివాడిని''. దైవప్రవక్త(స) మరో హితోక్తి: ''విశ్వాసులలో అందరికన్నా ఎక్కువ గుణవంతుడే పరిపూర్ణ విశ్వాసి. అలాగే మీ భార్యల పట్ల మంచివాడే మీలో అందరికన్నా శ్రేష్టుడు.'' (తిర్మిజీ). స్త్రీలు కూడా తమ భర్త, పిల్లల పట్ల శ్రేష్టమైన వాళ్ళే, నిజానికి శ్రేష్టులుగా పరిగణించబడతారు.

## కోపం, దుర్భాష

కోపమంటే ఎరుగని, ఎల్లప్పుడూ ప్రశాంతంగా, నోటినుండి మంచి మాటలు తప్ప దుర్భాష, బూతులు రాని మహానుభావులుగా సమాజంలో గుర్తింపు పొందిన ఎందరో మహానుభావులు తమ ఇళ్లల్లో మాత్రం మహా కోపిష్టులు. నోరు తెరిస్తే బూతు పురాణాలు వల్లించే కపటులూ ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళు ఇంటికి వచ్చారంటే ఇంట్లో వాళ్ళు గజగజ వణుకుతుంటారు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, బంధువులు అందరూ వారి ప్రతాపానికి బలవుతుంటారు. కొందరు తమ కింద పనిచేసే నౌకర్లు, సహాయకుల పట్ల చాలా దారుణంగా ప్రవర్తిస్తుంటారు. నీపై అధికారుల ముందు, నీకు సంబంధం లేనివారి పట్ల నువ్వు కోపాగ్నిని కంట్రోల్ చేసుకోవటం సులువైనదే. కానీ నీ అధీనంలో ఉన్నవారి పట్ల, నీ ఇంటివారి పట్ల కోపాన్ని దిగమింగటమే నిజమైన నైతిక విలువలకు తార్కాణం అని తెలుసుకోవాలి.

## అప్పులు ఎగ్గొట్టడం

కొందరు ఎంతో పెద్ద దానశీలురు. త్యాగశీలురుగా సమాజంలో తమ ఇమేజ్‌ను ప్రజల ముందుంచుతారు. కానీ వారు అప్పుల మీద అప్పులు చేసి ఎగ్గొట్టి ఎంతో దర్జాగా తిరుగుతుంటారు. అప్పు తీసుకున్నారంటే మళ్ళీ దాన్ని తీర్చే ప్రయాసే చెయ్యరు. ఇది నైతిక దుర్గుణాల్లోకెల్లా అతి చెడ్డ దుర్గుణం. ఎన్ని సత్కార్యాలు చేసుకున్నా రుణం తీర్చకుండా చనిపోతే స్వర్గ ప్రవేశం అస్సలు లభించదు.

## ఆస్తి హక్కులు కాజేయటం


ఇతరుల హక్కుల గురించి పోరాడేవారు, ఊరంతటికీ హక్కులు సమకూర్చడానికి న్యాయం చేసేవారు, తమ ఇంటి వారి హక్కులను మాత్రం కొల్లగొట్టి అక్రమంగా కాజేస్తారు. ఆస్తి హక్కుల విషయంలో చాలామంది చీటింగ్ చేస్తారు. పూర్తిగా అయినా కాజేస్తారు. లేదా ఎంతో కొంత భాగాన్నైనా కాజేస్తారు. హక్కుల పరిరక్షణ అనేది ఒక ముఖ్యమైన నైతిక గుణం. ఈ గుణాన్ని అత్యాశకు గురై విస్మరిస్తే పరలోకంలో ఘోర పరాజయం తప్పదు.

దైవప్రవక్త(స) హితోక్తి : ''నేను మీ మధ్య న్యాయం చేకూర్చడానికి పంపబడ్డాను'' ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు'' (ముస్లిం)

## వేషంతో మోసం

కొందరు సమాజంలో ధర్మపరాయణతకు ఉదాహరణలుగా వేషం వేసుకుంటారు. వారి దుస్తులు, హావభావాలు, ముఖం అన్నీ దైవదాస్యం ఉట్టిపడేలా ఉంటాయి. వారి మాటల్లో వేదాలు, వచనాలు, వాక్యాలు వినవస్తాయి. వారి వేష భాషలతో ప్రజల్ని ఆకట్టుకుంటారు. కానీ వారి అంతర్గత చేష్టలు, వారి నిజ స్వరూపం చాలా అనైతికంగా ఉంటుంది. అనేక చీకటి వ్యవహారాలు వీరి కేంద్రంగా నడుస్తుంటాయి. వీరి వేషం చూసి ప్రజలు మోసపోయి వీరి వల్ల అనేక కష్టనష్టాలను చవిచూస్తారు. ఇలాంటి దుర్మార్గులను కూడా మన సమాజంలో మనం చూస్తున్నాం. ఎవ్వర్నీ వేషం చూసి నమ్మకూడదు. వేషం 'ధార్మికమైనది' అయినంత మాత్రాన ఎవరూ 'నైతికంగా' మంచిగానే ఉంటారన్న గ్యారెంటీ ఉండదు.

ముఖ్యంగా ఆడవాళ్ళు 'ధార్మిక' వేషంలో ఉండేవారిని చాలా తొందరగా, గుడ్డిగా నమ్మేస్తారు. ఆడవాళ్ళ అమాయకత్వాన్ని చాలామంది వాడుకుని మోసంచేస్తారు. అందుకే ఆడవాళ్ళు వేషాన్ని చూసి నైతికతను అస్సలు అంచనా వేయకూడదు అని గుర్తుపెట్టుకోవాలి. ఎదుటివాడు మేక వన్నె పులి అయి ఉండవచ్చని గుర్తించాలి. ✤








# కోటలు చెప్పే చరిత్ర








**షహ్నాజ్ ఏజాజ్**

రాజులు పోయారు, రాజ్యాలూ పోయాయి. కానీ కోటలు, రాజ ప్రాసాదాలు ఇంకా కొన్ని మిగిలే ఉన్నాయి. వాటి అవశేషాలు, వాటి గత వైభవాన్ని చాటే విధంగా ఉన్నాయి. కోటలలోని కళా నైపుణ్యం, అలాగే శత్రు దుర్భేధ్యంగా వాటిని నిర్మించిన తీరు ఆ రాజుల యుద్ధ వ్యూహాలకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 123 కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో 73 కోటలు కోస్తా ఆంధ్రాలో ఉండగా 50 కోటలు రాయలసీమలో ఉన్నాయి. కొన్ని కోటలు ఇప్పటికీ ప్రత్యేకంగా ప్రజలను ఆకర్షించే విధంగా ఉన్నాయి. అయినప్పటికీ పెద్దగా పరిరక్షణకు నోచుకోవడం లేదు.

## గుత్తి కోట

అనంతపురం జిల్లా గుత్తి పట్టణ సమీపంలో ఉంది. దేశంలోని అత్యంత పురాతనమైన కోటలలో ఇది ఒకటి. ఈ కోట చాళక్యుల కాలంలో 7వ శతాబ్దంలో కట్టబడిందని భావిస్తారు. విజయ నగర రాజుల కాలంలో దీనిని దుర్గంగా, గుర్తించడం జరిగింది. ఆ తర్వాత ఇది కుతుబ్‌షాహీ వంశస్థుల పాలనలో ఉంది. 1746లో మరాఠాలు జయించారు. ఆ తర్వాత 1775లో హైదర్ అలీ స్వాధీనం చేసుకోగా, 1799లో దీనిని బ్రిటీష్ ఆక్ర

మించడం జరిగింది. ఈ కోట 15 బురుజులతో 15 ముఖ ద్వారాలు కలిగి ఉంది. ప్రస్తుతం ఇది పూర్తిగా శిథిలావస్థలో ఉంది. గుత్తి కోటలోని ప్రధాన విషయం ఇక్కడ దాదాపు 108 బావులు ఉన్నాయి. ఆనాటి కాలంలో నీటి కొరత లేకుండా ఉండేందుకు ఎంతో ముందు చూపుతో వీటిని త్రవ్వించారు.

## పెనుకొండ కోట

పెనుకొండ కోట శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో ఉంది. మొదట దీనిని జైన వంశస్థులు పాలించడం వలన ఇక్కడ జైన దేవాలయాలు ప్రసిద్ధి చెందాయి. ఆ తరువాత చాళుక్యులు, విజయనగర రాజులు, అలాగే నవాబులు, టిప్పుసుల్తాన్ పరిపాలించారు. కృష్ణదేవరాయల కాలంలో ఇది వారి రాజ్యానికి రెండవ రాజధానిగా వర్థిల్లింది. దీని శిల్పకళ, హంపీ, చంద్రగిరి కోటల శిల్పకళను పోలి ఉంటుంది. విజయనగర పతనం తర్వాత విజయనగర సంపదను పెనుకొండ కోటకు తరలించారని చరిత్రకారులు తెలియజేశారు.

## రత్నగిరి కోట

ఈ కోట కూడా శ్రీ సత్యసాయి జిల్లాలో ఉంది. దీనిని సీమ గోల్కొండ అని కూడా అంటారు. ఈ కోటకు, గ్రామానికి రత్నగిరి అనే కొండ వలన వీటిని కూడా అదే పేరుతో పిలవడం జరిగింది. దీనిని కూడా మొదట చాళుక్యులు తరువాత విజయనగర రాజులు, మరాఠాలు, ఆ తర్వాత మైసూర్ రాజులు అటు తర్వాత బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకున్నారు.

## కొండపల్లి కోట

ఈ కోట ఎన్టీఆర్ జిల్లాలో ఉంది. ఇది విజయవాడకు సమీపంలో ఉంది. ఈ కోటకు మూడు ప్రవేశద్వారాలు ఉన్నాయి. ప్రధాన ప్రవేశ ద్వారాన్ని దర్గా దర్వాజా అని పిలుస్తారు. ఇది 12 అడుగుల వెడల్పు 15 అడుగుల ఎత్తు ఉంటుంది. మరొక దర్వాజాను గోల్కొండ దర్వాజా అని పిలుస్తారు. ఇది జగ్గయ్యపేట వైపు ఉంటుంది. ఈ కోటకు కూడా శత్రు దుర్భేద్యమైన ప్రాకారం ఉంది. అనేక బురుజులు ఉన్నాయి. రాజ మహల్, రాణి మహల్, నర్తనశాల, అంగడి, కారాగారం, ఆయుధాగారం, పెద్ద పెద్ద నీటి కొలనులు ఈ కోటలో ఉన్నాయి. ఏనుగులు, గుర్రాలు వెళ్ళడానికి వీలుగా విశాలమైన రహదారులు నిర్మించడం జరిగింది. ముసునూరి కమ్మ రాజులు ఈ కోటను నిర్మించారు. ఆ తరువాత విజయనగర రాజులు పాలించారు. ఆపైన నిజాములు దీనిని స్వాధీనం చేసుకున్నారు. చివరిగా బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకొని సైనిక శిక్షణా శిబిరంగా మార్చుకున్నారు. ఈ ప్రాంతం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి బొమ్మలకు ప్రసిద్ధి. తేలికైన పొనికి చెక్కతో చేసే ఈ బొమ్మలు కొండపల్లి గ్రామస్తుల పనితనానికి నిదర్శనం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీని పునరుద్ధరణను చేపట్టింది.

## కొండవీడు కోట

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో ఈ కోట ఉంది. గుంటూరు నగరానికి 20 కి.మీ. దూరంలో ఉంది. రెడ్డిరాజులు కొండవీడు కోటను రాజధానిగా చేసుకొని పరిపాలించారు. అయితే కోటను శాతవాహనుల కాలంలోనే నిర్మించి ఉంటారని అంచనా. పురావస్తు త్రవ్వకాలలో బౌద్ధ స్థూపాలు బయటపడ్డాయి. పెదకోమటి వేమారెడ్డి పాలించిన కాలంలో శ్రీనాథ కవి అతని ఆస్థానంలో విద్యాధికారిగా పనిచేసారని అంటారు. ఆ కాలంలో సాహిత్యానికి, కళలకు పెద్ద పీట వేసారని, ఇతని పరిపాలనా కాలాన్ని స్వర్ణ యుగమని చెప్పుకుంటారు. ఈ కోటలో 25 నిర్మాణాలు ఉన్నట్లు తెలుస్తుంది. 44 కోట బురుజులు, 32 మైళ్ళ ప్రాకారాలు, రెండు ధాన్యాగారాలు, 5 దేవాలయాలు, గుర్రపు శాలలు, ఆయుధశాల, ఒక మసీదు ఉన్నాయి. అలాగే కొండమీద మూడు చెరువులు వున్నాయి. ఒకటి నిండగానే నీరు వృధా కాకుండా రెండవ చెరువులోకి వెళ్ళే విధంగా తవ్వించి కోట క్రింద దాదాపు 37 ఎకరాల విస్తీర్ణం గల కందకాన్ని ఏర్పాటు చేసారు. కొండ పై నుండి నీరు ఈ కందకంలో వచ్చి చేరేది. చుట్టుప్రక్కల ఉన్న 5 గ్రామాల రైతులు సాగునీరు కోసం ఈ నీటిని ఉపయోగించేవారు. కొండవీడు కోటను రాష్ట్ర ప్రభుత్వం రక్షిత కట్టడంగా గుర్తించింది. అయినప్పటికీ తగిన విధంగా ఈ కోట సంరక్షణకు నోచుకోవడం లేదు.

## ఉదయగిరి కోట

నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి మండలంలో ఈ కోట ఉంది. ఈ కోటకు వెయ్యి ఏళ్ళ చరిత్ర ఉందని తెలుస్తుంది. పల్లవులు, చోళులు, విజయనగర రాజులు, కమ్మ రాజులు, ఢిల్లీ సుల్తానులు దీనిని పాలించినట్లు తెలుస్తుంది. చివరిగా బ్రిటీష్ వారి పాలనలోకి వెళ్ళిపోయింది. బ్రిటీష్ పాలనలో కూడా ఈ కోటను కొత్త కట్టడాలతో అభివృద్ధి పరచినట్లుగా తెలుస్తుంది. కానీ ప్రస్తుతం ఇది శిథిలావస్థలో ఉంది.

వెయ్యి యేళ్ళ వైభవం ప్రస్తుతం ఎటువంటి సంరక్షణకు నోచుకోలేక శిథిలాలుగా కుప్పకూలి పోతున్నాయి. దాదాపు ప్రతి కోట పరిస్థితి కూడా ఇదే. చరిత్రను తెలియజేసే, చాటి చెప్పే ఈ కోటలను ప్రభుత్వాలు సంరక్షించ వలసిన బాధ్యత తీసుకోవాలి. ✤

**అక్టోబర్ 2024 సంచికతో చందా పైకం ముగిసిన పాఠకులు తమ చందా పైకాన్ని పంపి రెన్యువల్ చేసుకోవాలని మనవి.**

**– సర్క్యులేషన్ మేనేజర్**

# మీ ఆరోగ్యం మీ “చేతుల్లో”



ముహమ్మద్ ముజాహిద్

**అనారోగ్యంతో** ఎన్నో రోజులు ఇంటి పట్టునే ఉన్న సుహానీ ఆ రోజు ఎంతో ఉత్సాహంగా స్కూలుకు వచ్చింది. తాను ఇన్ని రోజులు బడికి ఎందుకు రాలేదో, తనకు కడుపు నొప్పి, జ్వరం ఎందుకు వచ్చిందో పాట రూపంలో వివరించింది. చేతుల అపరిశుభ్రత వల్ల క్రిములు కడుపులోకి వెళ్లి ఇన్ఫెక్షన్ వచ్చిందని చెప్పింది. మన చేతి వేళ్లు మొదలు మో చేతుల వరకూ కనపడని లక్షల సంఖ్యలో క్రిములుంటాయని, మూత్ర విసర్జనకు వెళ్లి చేతులు కడుక్కోకుండా ఏదైనా తిన్నా, శరీరంలో ఎక్కడైనా దురద పెట్టినప్పుడు అక్కడ చేతులతో గోక్కొని అదే చేతులతో తిన్నా కడుపులోకి క్రిములు చేరతాయని చెప్పింది. పెంపుడు జంతువులు, చెత్త బుట్ట, కంప్యూటర్ కీ బోర్డులను ముట్టుకున్న తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోక్కుండా ఏదైనా తింటే కడుపులోకి క్రిములు చేరతాయని వివరిచింది. తరచూ, భోజనానికి ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కొంటే క్రిములను పారదోలవచ్చని పిల్లలకు అర్థమయ్యేట్టు చెప్పింది.

“వావ్ అమ్మీ.. ఘుమఘుమలాడే వాసన వస్తోంది. ఏం వంట చేశావ్” అంటూ అబ్దుల్ బారీ సంతోషంతో వచ్చి డైనింగ్ టైబుల్పై కూర్చున్నాడు. ముందు నువ్వు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కొని వచ్చి కూర్చుంటే చెప్తా అని అతడి తల్లి చెప్పింది. దానికి అబ్దుల్ బారీ “అమ్మా.. ఇంతక్రితమే కదా నమాజు కోసం వుజూ చేసింది. మళ్లీ ఎందుకు చేతులు కడుక్కోవాలి?” అని ప్రశ్నించాడు. “కానీ తినే ముందు చేతులు నీళ్లతో శుభ్రంగా కడుక్కోవాలి కదా. అలా కడుక్కోవడం వల్ల చేతులకు అంటుకున్న మలినాలు దూరమవుతాయి” అని అబ్దుల్ బారీ అక్కయ్య నచ్చచెప్పడం పూర్తి కాకముందే అబ్దుల్ బారీ పరిగెత్తుకుంటూ వెళ్లి చేతులు కడుక్కొని వచ్చి అన్నం తిన్నాడు.

యూట్యూబ్‌లో కనిపించే పై రెండు వీడియోలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. మనుషులపై దాడి చేస్తున్న రోగాల్లో సగం వ్యాధులకు కారణం చేతుల అపరిశుభ్రతే. ప్రపంచవ్యాప్తంగా పసి పిల్లల మరణాలకు.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మరణాలకు చేతుల అపరిశుభ్రతే ప్రధాన కారణమని పలు వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. భోజనానికి ముందు చేతుల పరిశుభ్రత పాటించాలన్న అవగాహన చాలా మంది తల్లిదండ్రుల్లోనూ కొరవడింది. ఏటా అక్టోబర్ 15న గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే (ప్రపంచ చేతుల పరిశుభ్ర దినోత్సవం) ను ఎన్నో దేశాలు జరుపుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంతగా చేయి దాటిందో అంచనా వేయవచ్చు. చేతుల పరిశుభ్రత పాటించడం ఎంత అవసరమో అర్థం చేసుకోవచ్చు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఎంతో సులువైన పని. అయినా కొంతమంది బద్ధకంతోనే, అవగాహన రాతహిత్యంతోనే ఆ పని చేయకుండా రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. నిత్యం చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా మనం ఇంటా, బయట అనేక పనుల్లో నిమగ్నం అయి ఉంటాం. ఆ పనులు చేస్తున్నప్పుడు మన చేతులకు, చేతి వేళ్లకు వందలాది క్రిములు అంటుకుంటాయి. దాన్ని గురించి పట్టించుకోకుండా కొన్నిసార్లు అదే చేతులతో భోజనం చేస్తుంటాం. దాని వల్ల ఆ క్రిములు

మన శరీరంలోకి చేరి అనారోగ్యం పాలవుతాం.

### పరిశుభ్రత ఇస్లామ్‌లో సగ భాగం

అందుకే తినే ముందు రెండు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ముహమ్మద్ ప్రవక్త (అసం) చెప్పిన సూచన శిరోధార్యం. ఇస్లామ్ ధర్మం పరిశుభ్రతకు పెద్దపీట వేసింది. తహారత్, గుసుల్, వుజూ లాంటి విషయాలన్నీ పరిశుభ్రతకు ప్రాణం పోస్తాయి. మూత్ర విసర్జన తరువాత మూడుసార్లు చేతులు కడుక్కోవాలన్నది ప్రవక్త ఆదేశం. హజ్రత్ సల్మాన్ ఫార్సీ(రజి) ఉల్లేఖనం ప్రకారం "తినే ముందు, తిన్న తరువాత వుజూ చేయడం వల్ల శుభం, సమృద్ధి చేకూరుతాయి" అని ప్రవక్త ప్రవచించారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందన్న సామెత ఆరోగ్యానికీ వర్తిస్తుంది. నోటిలోని దంతాలు పటిష్టంగా ఉంటే జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేస్తుందని డాక్టర్లు సూచిస్తున్నారు. చేతులు కడుక్కున్నాక తడి చేతులతోనే భోజనం చేయాలి. తడి చేతులను రుమాలు లేదా టవల్‌తో తుడుచుకుంటే వాటికి ఉన్న క్రిములు మళ్లీ మన చేతులకు అంటుకుంటాయి. "ఎవరైతే తన ఇంటిలో శుభం, సమృద్ధి కలగాలని అభిలషిస్తాడో అలాంటి వ్యక్తి భోజనానికి ముందు, తర్వాత కాళ్లు, చేతులు కడుక్కోవాలని 1400 సంవత్సరాలకూ పూర్వమే చెప్పారంటే ఇస్లామ్ సహజ ధర్మమనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి. ముహమ్మద్ ప్రవక్త ఆరోగ్యం కోసం ఇలాంటి ఎన్నో సూచనలు చేశారు.

ప్రతి ముస్లిం కూడా నమాజ్‌కు ముందు విధిగా వుజూ చేయవలసిందే. వుజూలో ముందుగా రెండు చేతులను మొదట మణికట్టు దాకా కడగాలి. దీనివల్ల చేతులలోని మలినాలు శుభ్రం అవ్వడమేకాక చేతులు కడిగేటప్పుడు అరచేతులను రుద్ది కడగటం వల్ల రక్తప్రసరణ మంచిగా జరిగి ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు మనకు తెలియకుండానే సమసిపోతాయి. అలాగే చేతులను వుజూలో మోచేతుల వరకు కూడా కడుగుతారు. దీనివల్ల కూడా పరిశుభ్రతతోపాటు రక్త ప్రసరణ జరిగి, ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజుకు ఐదుసార్లు ఇలా చేయడం తప్పనిసరి కాబట్టి ఎన్నో సమస్యలు సమసిపోతాయి. ఇంకా కేవలం నమాజుకు ముందేకాక కాలకృత్యాలు తీర్చుకున్నప్పుడు కూడా ప్రతిసారి వుజూ చేయడం వల్ల ఎంతో పుణ్యం ప్రాప్తిస్తుందని తెలియజేయడం జరిగింది. ఈవిధంగా కూడా ఇస్లాం మానసిక ప్రశాంతత శారీరక పరిశుభ్రతతో ముడిపడిందని తెలియజేస్తుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించింది. ఆ సంస్థ సూచనల ప్రకారం భోజనానికి ముందు సబ్బుతో మూడుసార్లు చేతి వేళ్ల సందుల్లోని మురికిని శుభ్రం చేయాలి. రెండు చేతులను ఇరు వైపులా, మణికట్టు వరకు శుభ్రం చేసుకోవాలి. కనీసం నెలకోసారి చేతి గోళ్లను కత్తిరించుకోవాలి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. దాన్ని చేజేతులా పాడు చేసుకోకుండా కాపాడుకుందాం. ✤

## పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సఅసం

**హమీదా బేగం**

అనాథయై జన్మించి మహోన్నత శీలాన్ని పొంది
వ్యాపారంలో నిజాయితీతో లాభాలలో అందరినీ అధిగమించిన
సత్యసంధుడు నిజాయితీపరుడిగా నిలిచిన
పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సల్లల్లాహుఅలైహివసల్లం

అన్యాయం, అక్రమం,అవినీతి, హత్యాచారాలు
మద్యపానం, జూదం, వ్యభిచారాలతో మానవత్వం మంటగల్సినవేళ
అతి స్వల్ప కాలంలో సత్సమాజాన్ని స్థాపించిన
పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సఅసం

అనాథలకు ఆప్తుడిగా, వితంతువులకు బాసటగా
చెప్పటమే గాక చేసి చూపిన
25 సంవత్సరాల నవ యువకుడు
40 సంవత్సరాల వితంతువును వివాహమాడి ఆదర్శంగా నిలిచిన
పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సఅసం

విగ్రహారాధన, మూఢనమ్మకాలను తొలగించి
దిగంబరులై దైవగృహ ప్రదక్షణను నివారించి
ఏకదైవారాధన, జవాబుదారులుగా మెలగమని చెప్పిన
పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సఅసం

తెల్లవానికి నల్లవానిపై, బలవంతునికి బలహీనుడిపై
ధనికునికి పేదవానిపై ఎలాంటి హక్కు లేదని
దైవభీతి, సత్ప్రవర్తన లే అసలైన హక్కులని
ఆదమ్ సంతతి రీత్యా అందరు సమానమని నినదించిన
పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సఅసం

తల్లి పాదముల క్రింద స్వర్గం వారసత్వంలో కూతురి వాటా
సుగుణవంతురాలైన భార్య ప్రపంచ సంపద కంటే విలువైనదని
అణిచివేయబడిన స్త్రీని ఆకాశానికెత్తిన
పరిపూర్ణ మానవుడు ముహమ్మద్ సఅసం



# 'వృద్ధాప్యం ఒక వరం - కారాదు శాపం

ఫాతిమా

జీవితమనే నాటకంలో చివరి అంకం వార్ధక్యం (ముసలితనం). అప్పటి వరకు చేతినిండా పని, కుటుంబ సభ్యులతో క్షణం తీరిక లేని జీవితం, చుట్టూ పిల్లలు, స్నేహితులు, చుట్టాలు... ఇలా మరెన్నో, అప్పటివరకు చురుగ్గా పనిచేసిన కాళ్లు, చేతులు, చెవులు, కళ్ళు వయసు మీద పడటంతో సరిగ్గా పనిచేయటం మానేస్తాయి. వయసు పెరుగుతున్న కొద్దీ డయాబెటిస్, బీపీ, ఎముకలు, కండరాలు బలహీనమవటం, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు వస్తాయి. కానీ వీటన్నింటికీ మించి వయసుతో వచ్చే డిప్రెషన్ ఎక్కువ ఇబ్బంది పెడుతుందని స్టడీలు చెబుతున్నాయి.

ఇంకొందరిని జీవిత భాగస్వామి కోల్పోవడం ఇంకింత నిస్సహాయులుగా చేస్తుంది. పిల్లలు లేని వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

నవ మాసాలు మోసి ప్రాణాలు పోసి పిల్లల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమపడి ఆస్తులు కూడపెట్టి ఏ కష్టం తెలియనీయకుండా పిల్లలే లోకంగా బ్రతికిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పిల్లలకు భారమై వయసు మీద పడిన తర్వాత రెక్కలు ముక్కలై మూలకు పడటంతో వారిని ఆదరించి, ఆదుకుని సపర్యలు చేయాల్సినటువంటి క్రమంలో అమానవీయంగా ఇంట్లో నుంచి రోడ్డు మీదికి తోసి వేయటం, వృద్ధాశ్రమాలలో నెట్టి వేయటం లాంటి వాటికి పాల్పడటమే కాకుండా కనిపెంచిన మమకారం లేకుండా ప్రాణదాతలైన తల్లిదండ్రులను హతమార్చే స్థితికి చేరుకోవటం విలువల పతనానికి పరాకాష్ట. ఇప్పుడు మన బంధాలు ఇలాగే తయారయ్యాయి.

## సమస్యలు

వయసు మీద పడిన వృద్ధులు... పిల్లా జెల్లా అంతా ఉన్నా పట్టించుకునే వారు లేక బాధపడుతున్నవారు... నడిచే శక్తి పలికే ఓపిక లేక ఇబ్బంది పడుతున్నవారు... పిడికెడు మెతుకులు పెట్టి కాసింత చోటు ఇస్తే... బిడ్డల నీడలో కన్నుమూస్తామని ఆరాట పడుతున్నారు. ఇలాంటి వృద్ధ దంపతులు ఇద్దరు ఉన్నంతకాలం

ఎలాగోలా బతికేస్తున్నా... ఎవరైనా ఒకరు దూరమైన తర్వాత ఒంటరి జీవితం నరకప్రాయంగా మారుతుంది. తోడు కోల్పోయి బిడ్డల ఆదరణ కరువై మానసికంగా కుంగిపోతున్నారు. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతూ... సరైన వైద్యం అందక కన్నుమూస్తున్నారు. మరికొందరు ఈ జీవితం మాకొద్దంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఒకప్పుడు పెద్ద సంఖ్యలో ఉన్న ఉమ్మడి కుటుంబాలు దాదాపు చెల్లాచెదురైపోయాయి. చిన్న కుటుంబాలు పెరిగాయి, అదే సమయంలో మానవ సంబంధాల్లోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. చాలామందిలో స్వార్థ చింతన పెరిగింది మరోవైపు ఎంతో మంది యువకులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్తున్నారు. మరి కొంతమంది బతుకుతెరువు కోసం దూరంగా జీవిస్తున్నారు. ఇంకొంతమంది ప్రభుత్వ ఉద్యోగం పేరుతో కన్నవారికి దూరంగా జీవితం గడుపుతున్నారు. ఈ పరిణామాలన్నీ వృద్ధ దంపతులకు శాపంగా మారాయి. పిల్లలు విదేశాల్లో ఉండటంతో ఎంతోమంది ఒంటరిగా నిస్సహాయకులుగా జీవితాలు వెల్లదీస్తున్నారు. మరికొందరు కన్నవారితో కలిసి ఉంటున్నా సరైన ఆదరణకు నోచుకోక మౌనంగా రోదిస్తున్నారు. పక్కనే ఉన్న చూడని వారు ఇంకొందరు, ఆప్యాయత కోసం ఎదురు చూసే వృద్ధులు ఎందరో.

నేడు పెద్దలు లేదా వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యుల ఆలోచన ధోరణి విపరీతంగా మారింది. గత శతాబ్ద కాలంలో సంభవించిన సామాజిక, ఆర్థిక మార్పుల వల్ల కుటుంబాలలో వృద్ధుల పట్ల ప్రేమ, ఆదరాభిమానాలు క్రమేపీ క్షీణిస్తున్నాయి. మన దేశంలో ప్రతి 10 మందిలో ఒకరు వృద్ధాప్యంలో ఉన్నారు. 2050 సంవత్సరానికి వృద్ధుల జనాభా 50 కోట్లు దాటుతుందని అంచనా.

## ఎక్స్ పెక్టేషన్స్ వద్దు

ఇంతకుముందు చలాకీగా ఇంటిని, డబ్బు విషయాన్ని చక్కబెట్టిన తల్లిదండ్రులు నిస్సహాయ స్థితిలో చూడటం పిల్లలకి ఇబ్బందే. కానీ అదే రియాలిటీ. దాన్ని అందరూ అంగీకరించాల్సిందే. మానవ జీవితంలో ఎవరికైనా తప్పని దశ. అలా కాకుండా వారిని కోపగించుకోవడం, చిరాకు పడటం లాంటివి చేస్తే వాళ్ళ మనసు నొచ్చుకుంటుంది. తమని తామే తక్కువ చేసుకుంటారు. ఒంటరిగా ఫీలవుతారు. అందుకే పిల్లలు తల్లిదండ్రుల వయసుని దృష్టిలో పెట్టుకొని దానివల్ల వచ్చే సమస్యల గురించి అవగాహన పెంచుకొని వాళ్ళని సంతోషంగా ఉంచాలి. ఇంకా మేమున్నాం అనే భరోసా ఇవ్వాలి. పిల్లలు తమని నిర్లక్ష్యం చేస్తున్నారన్న భావన పేరెంట్స్‌కి రాకుండా చూసుకోవాలి. అందుకోసం వాళ్లకి టైం ఇవ్వాలి. వాళ్లతో ఉన్న జ్ఞాపకాలను ఎప్పటికప్పుడు గుర్తు చేస్తుండాలి. ఇవన్నీ వాళ్లలో ఉత్సాహాన్ని పెంచుతాయి.

## ఓపిక అవసరం

ముసలితనంలో అందరూ పిల్లలే. అందుకే పసిపిల్లలతో ఎలా నడుచుకుంటారో వాళ్ళతోను అలాగే ఉండాలి. వాళ్లకి పిల్లల తోడు అవసరం అన్న విషయాన్ని ఎప్పుడూ గుర్తించుకోవాలి. వాళ్ల ఎమోషన్స్‌ని, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. పెద్దవాళ్ళు ఏదైనా పని చేస్తున్న 'ఈ వయసులో నీకెందుకు'? అంటారు. సరదాగా బయటికి వెళ్లే ఛాన్స్ ఉండదు వాళ్లకి. నచ్చింది తినే అవకాశం లేదు. పెద్దవాళ్ల ఆరోగ్యం కోసం ఇంట్లో వాళ్ళు జాగ్రత్తతో చేసే ఈ పనులు చుట్టూ ఎంతమంది ఉన్నా ఒంటరిగానే ఉన్నాము అనే భావన వారిలో పెరుగుతుంది. తాము ఎవరికీ నచ్చట్లేదన్న భావన కలుగుతుంది. వయసు మీద పడుతున్న కొద్ది తమ జీవితం ముగిసిపోయింది అన్న ఫీలింగ్స్ పెరిగిపోతాయి. అందుకే పెద్దవాళ్ళను ఓపికగా చూసుకోవాలి.

'వృద్ధాప్యం ఒక వరం. కారాదు శాపం' అన్నట్లుగా వృద్ధాప్యాన్ని ఆస్వాదించేటట్లుగా పరిస్థితులను సమాజం సృష్టించాలి. వృద్ధాప్యాన్ని సుఖవంతం చేయని జాతి ఎప్పటికీ ఫలవంతం కాదు. ఏ జాతి కీర్తి గౌరవ సుఖసంపదలైన ఆ జాతి వృద్ధుల నిర్విరామ కృషి ఫలితాలే.

## బతికిస్తున్న 'ఆసరా'

ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు ఎంతోమంది వృద్ధుల బతుకులకు ఆసరాగా నిలుస్తున్నాయి. మందులు, నిత్యావసరాలకు కొంత వరకు పింఛన్ ఉపయోగాగపడుతుంది. ఇదే సమయంలో కన్న వారి పెన్షన్ డబ్బులు కోసం పిల్లలు వేధిస్తున్న సంఘటనలూ ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 2007లో ఒక చట్టం తెచ్చింది. తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2009 సెప్టెంబర్ 1న అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం తల్లి దండ్రులను పోషించాల్సిన బాధ్యత కొడుకు, కూతురుతో పాటు మనుమలు మనవరాళ్ల పై ఉంటుంది. వృద్ధుల నుండి ఆస్తులు పొంది వారి బాగోగులు చూడకుండా ఉంటే వారి నుంచి పొందిన ఆస్తులను చట్ట ప్రకారం రద్దు చేసే అవకాశం ఉంది.

చాలా కుటుంబాల్లో పేదరికం ఇబ్బందులను సృష్టిస్తోంది. తాము భార్య పిల్లలు బతకటమే కష్టమని, ముసలి వాళ్లను ఎలా పోషించాలంటూ కొందరు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్థికంగా ఉన్న కుటుంబాల్లో మరో రకమైన సమస్య ఉంటుంది. తమకు ముసలి వాళ్లు అడ్డుగా ఉంటున్నారంటూ ఆశ్రమాలకు పంపించడమో, వేరుగా ఉంచడమో చేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో చాదస్తం ఎక్కువైంది అంటూ వృద్ధులను ఇబ్బంది పెడుతున్నారు.

తల్లిదండ్రుల పట్ల ఆదరణ కనపరచని వారు, దైవం పట్ల ఎంత భక్తిని ప్రదర్శించిన వ్యర్థమే. ✤



# మహిళా రక్షణకై మనోవేదన

షరీఫా

**'అత్యాచారం' మహిళ జీవితాన్ని చిదిమివేసే ఘోరమైన నేరం.** ఢిల్లీలో నిర్భయ ఘటనతో దేశం యావత్తు నివ్వెరపోయింది. నిందితులను ఉరితీయాలంటూ గొంతెత్తి ఆక్రోశించింది. కశ్మీరులోని కథువాలో ఎనిమిదేళ్ల బాలికను కామాంధులు కాలరాస్తే ఆసేతు హిమాచలం ఆవేదన చెందింది. 90శాతం అత్యాచార ఘటనలు బాగా తెలిసినవారు, పరిచితులు పాల్పడుతున్నవే. అత్యాచారాలు కాకతాళీయంగా సంభవించేవేం కాదు. పథకం ప్రకారం జరుగుతున్నవే ఎక్కువ. ఒంటి మీద గాయల్లేకున్నా, మానసిక గాయాలకు చికిత్స అవసరమే. పురుషుడు పైశాచికంగా ప్రవర్తించడానికి కారణాలేమిటి? అతని మానసిక స్థితి ఎలాఉంటుంది? అనే దానిపై అనాదిగా ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు సాగుతూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు రకరకాల సిద్ధాంతాలు, విశ్లేషణలు వెలుగు చూస్తున్నాయి. కేవలం కామవాంఛ తీర్చుకోవడానికే అత్యా చారాలు చేస్తారని దశాబ్దాల క్రితం అనుకునేవారు. అది నిజం కాదని అధ్యయనాల్లో వెల్లడైంది. వీరు తమ ఉద్రేకాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శించుకోవటానికే వీటికి తెగిస్తున్నట్లు గుర్తించారు. శత్రువు మీద పగ తీర్చుకోవటానికి వారి పిల్లల్ని ఎత్తుకెళ్ళటం, భార్యలపై అత్యాచారం చేయడం లాంటివి తరచూ కనిపిస్తున్నాయి. మన సమాజం పురుషుడికి కొంత లైంగిక స్వేచ్ఛను, ఆధిపత్యాన్ని ఆపాదిస్తుండటం ఇలాంటి ప్రకోపాలకు ఆస్కారం ఇస్తోందని సామాజిక అధ్యయనవేత్తలు వాదిస్తున్నారు.

రేపిస్టుల మనసుల్లో ఏముంటుంది అనే విషయాలను బయటికి తేవడానికి మన దేశానికి చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ రంజిత్ మిశ్రా ప్రయత్నించారు. ఇందుకోసం జైళ్ళలో శిక్ష అనుభవిస్తున్న రేపిస్టులతో ఆయన మాట్లాడారు. వీళ్ళలో చాలామంది తాము ఎప్పటికైనా జైలు నుంచి బయటకు వస్తామని బలంగా నమ్ముతున్నారు. ఓ పక్క నేర నిర్ధారణ జరిగి శిక్ష అనుభవిస్తున్నా తాము నేరం చేశామని వారు విశ్వసించకపోవడం శోచనీయం. వీరు సాధారణంగా నిస్సహా యుల్ని, ఒంటరివారిని, చిన్నపిల్లల్ని లక్ష్యంగా చేసుకుంటు న్నారు. చిన్న పిల్లలకు లైంగిక చర్యల పట్ల అవగాహన ఉండదు కాబట్టి, దాని తీవ్రతను వారు గుర్తించలేరు, ఎదిరించలేరు కూడా. చాక్లెట్లో, బొమ్మలో ఇచ్చి తేలిగ్గా లొంగదీసు కోవచ్చు అని భావించటం బాధాకరం. అత్యాచారాలకు పాల్పడేవారిలో చాలామంది పత్రికల్లో,టీవీల్లో, సోషల్ మీడియాలో వచ్చే అత్యాచార వార్తలను నిశితంగా గమనిస్తూ చాలా జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం.

క్లినికల్ సైకాలజిస్ట్ నికోలస్ గ్రోత్ (మెన్ హూ రేప్ అనే పుస్తకంలో 1976) రేపిస్టులు అందరికీ మూడు ఉద్దేశాలు ఉంటాయి. 1. పర పీడన కాముకత్వం (శాడిజం) 2. ఉద్రేకం 3. అధిపత్యాన్ని ప్రదర్శించుకోవాలన్న కోరిక. అత్యాచారం అన్నది సంపూర్ణ మానసిక ఆరోగ్యం కలిగిన వ్యక్తి చేసేది కాదు. తాత్కాలికంగా లేదా శాశ్వతంగా మానసిక స్థిరత్వం లేని వ్యక్తే ఈ దారుణానికి ఒడిగడతాడు అని విశ్లేషించాడు. అత్యాచారం చేస్తున్న వీరు సాధారణ స్వభావుల్లాగా కనబడతారు. ఇతరులతో కలిసి తిరిగేటప్పుడు తమ భావోద్వేగాల్ని బయట పడనివ్వరు. కానీ వీరు ఎప్పుడు అత్యాచారానికి తెగబడుతారన్నది చెప్పటంకష్టం. తమ మానసిక స్థితిపై వీరికి నియంత్రణ ఉండదని జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన ఫోరెన్సిక్ సైక్రియాజిస్ట్ రాబర్ట్ సైమన్ వివరించారు. అయితే వీరందరిలో కనిపించే గుణం బాధితులపై ఏమాత్రం జాలి, దయ, సానుభూతి లేకపోవడం. సాధారణంగా అందరికీ అమానుషంగా, క్రూరంగా అనిపించే చర్యలు వీరికి ఏ కోశానా అలా అనిపించవు.

మానసిక వైద్య నిపుణురాలు గౌరీ దేవి ఇలా తెలుపుతున్నారు:

ఉన్మాదులు మనలో ఒకరిలాగే ఉంటారు. చిన్నతనం నుండే సామాజిక కట్టుబాట్లను పాటించక ప్రాణులను హింసించి ఆనందపడుతుంటారు. దొంగతనాలు, అబద్ధాలు చెప్పటం తమకంటే పెద్దవారితో సాహసం చెయ్యటం, ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాలకు అలవాటుపడుతంటారు. తల్లిదండ్రులు తక్షణమే దిద్దుబాటు చర్యలకు పూనుకోవాలి. వయసు పెరుగుతున్నకొద్దీ అది శ్రుతిమించుతుంది. అందుకే బాల్యం నుండే కుటుంబ విలువల్ని బోధించాలి. స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉన్న ఈ కాలంలో వాటిని ఎలా వినియోగిస్తున్నారు అని పర్యవేక్షించాలి. నిద్రపోవాల్సిన సమయంలో చాటింగ్‌లు, వీడియో కాల్స్‌తో కాలం గడుపుతుంటే దానివల్ల కలిగే నష్టాలను స్నేహపూర్వకంగా విడమరిచి చెప్పాలి. 10-16 సంవత్సరాల వయసులో సెక్స్ పట్ల ఆసక్తి కనబర్చటం సహజం. కోరికలు కలిగినప్పుడు వాటిని ఎలా నియంత్రించు కోవచ్చో తెలియపర్చాలి. అవసరం అనుకుంటే మానసిక నిపుణులను సంప్రదించాలి. ఈ వయసులో విద్య, వృత్తుల్లో ఎదుగుదలకు అవసరమైన శిక్షణలో వారిని నిమగ్న మయ్యేలా చూడాలి. ఆడ పిల్లలు కూడా ఒంటరిగా వెళ్ళాల్సి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని విశ్లేషించారు గౌరీ దేవి గారు.

నీతి, భీతి లేని నరజాతిని చూస్తున్నాం. బతుకునిచ్చే మహిళలను బతకనివ్వరా? లోపం ఎక్కడుంది? మగపిల్లల పెంపకంలోనా? బాల్యం నుండే నైతిక విలువలను నేర్పని పెద్దల్లోనా? విచ్చల విడిగా దొరికే మద్యంలోనా? భయం కలిగించలేని చట్టంలోనా? 'నేరప్రవృత్తి' కలిగిన వారే రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజలను పాలిస్తున్నారు. ఎటు వంటి నైతిక విలువలు పాటించని వారి నుండి ఉత్తమ, నైతిక సమాజాన్ని, సామాజిక సంస్కరణా చట్టాలను ఆశిం చటం నేతి బీరకాయ నుండి నేతిని ఆశించటమే. ఈ మధ్య తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు, ఆడపిల్లలను లైంగిక దృష్టితో, కామ దృష్టితో వ్యాఖ్యలు చేయటం, ఆ వ్యాఖ్యలను 'డార్క్ కామెడీ' పేరుతో సమర్థించుకోవటాన్ని కొందరు వత్తాసు పలకటం ఇలాంటి వీడియోలను వీక్షించడం ఆందోళనకరం. సమాజం లోని ప్రతి ఒక్కరూ ఈ వీడియోల పట్ల తీవ్ర నిరస నను తెలియజేస్తున్నారు. కామెడీ షోలు, సినిమాలలోని అవాంఛ నీయ లైంగిక దృశ్యాలు, సంభాషణలు అవాంఛనీయ పోకడలకు దారి చూపుతున్నాయి. యువత పెద్ద సంఖ్యలో అభిమానిస్తున్న సినిమా హీరోలు, దర్శకులు 'యానిమల్', 'జీఎస్‌టీ' లాంటి సినిమాలు యువతను హింసాత్మకంగా, అమానవీయంగా మారుస్తున్నాయి.

ఆర్థిక స్వాలంబనే ధ్యేయంగా మద్యం, గంజాయి లాంటి మత్తు మందులు లైంగిక వ్యాపారానికి కారణమని సామా న్యులు సైతం భావిస్తున్నారు. వీటికి పసిపిల్లలు, ఒంటరి మహిళల కుటుంబాలు, పేదలు, దళితులు, ఆదివాసీల బిడ్డలు పెద్ద ఎత్తున బలి అవుతున్నారు. మన దేశం ధార్మిక దేశం. కావున పిల్లలకు బాల్యంనుండే ప్రవక్తల, సత్పురుషుల కథలు వినిపిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు పిల్లల చేత అవసరార్థులకు అన్న పానీయాలు మొదలైనవి పెట్టించాలి. ఈ విధమైన అలవాట్ల వలన పిల్లల్లో సత్ప్రవర్తన, ఔదార్యం లాంటి నైతిక గుణాలు ఏర్పడతాయి. అంతేకాదు తినే పదార్థాలు, అన్నదమ్ముల మధ్య, అక్కాచెల్లెళ్ళ మధ్య పంచుకునే అలవాటు చెయ్యాలి. అందువల్ల పరస్పరం హక్కులను గౌరవించే భావన, న్యాయం చేయాలనే భావన అంకురిస్తుంది. అనవసర గారాబంతో పిల్లలను మంకు పట్టుగల వారిగా, మొండివారిగా తయారు చెయ్యరాదు. ప్రతి పనికి నౌకర్లపై ఆధారపడకుండా, స్వయంగా తమ పనులు తామే చేసుకునేవారిగా మలచాలి.

నేటి ఆధునిక జీవన శైలిలో ఆర్థిక రంగంలో అమ్మలు కూడా భాగస్వామ్యం చెందటంతో పిల్లలపై నిఘా కొంతవరకు తగ్గిందనే భావించాలి. బామ్మలు, తాతలు వృద్ధాశ్రమంలో దీనంగా జీవనం సాగిస్తున్నారు. నేటితరం పిల్లలకు ఇంట్లో నైతిక విలువలను బోధించేవారు లేకపోవటం కూడా ఒక కారణమే. విద్యాలయాల్లో, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల చూపవలసినంత శ్రద్ధ చూపక పోవడం, ఈనాటి ఆధునిక విద్యా వ్యవస్థలో ర్యాంకులు, మార్కులు, గ్రేడులే ప్రధానంగా భావించి నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వకపోవటం కూడా ఒక ప్రధాన అంశమే.

కూలుతున్న కుటుంబ వ్యవస్థ, విద్యారంగం, వాణిజ్య రంగంగా భాసిల్లటం, విపరీతంగా పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వాడకం, అందుబాటులో ఉన్న సోషల్ మీడియా ద్వారా అశ్లీల చిత్రాల పట్ల ఆకర్షితులవుతున్న యువతరం మద్యం, గంజాయి, గుట్కా లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావటం. వీటి ప్రభావంతో మత్తులో తల్లి, చెల్లి అనే బేధభావా లను మరచి పశు ప్రవృత్తితో ప్రవర్తించటం, ఒక తల్లి తన మీదే మత్తులో అత్యాచారానికి పాల్పడటంతో విధిలేక కన్న కొడుకునే హతమార్చింది అంటే సమాజంలో అశ్లీలత స్థాయిని అంచనా వేయవచ్చు. అరచేతిలో ఇమిడే స్మార్ట్‌ఫోన్లు, అశ్లీల వెబ్‌సైట్ల ఒరవడిలో పశువాంఛను ప్రేరేపించి నైతిక విలువలకు తలకొరివి పెడుతున్నాయి. ఇండియా అంటే నేరాలు, అత్యాచారాలు తప్ప మరేమీ కాన ట్లుంది అని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించటం బాధాకరం. నేను పుట్టి, పెరిగిన భారతదేశ మౌలిక సంస్కృతి ఇది కానేకాదు అని అరుంధతి రాయ్ వంటి వారు ఆక్రోశించటం భీతావహ దుస్థితిని కళ్ళకు కడుతోంది.

చట్టాలు రూపొందించినంత మాత్రాన నేరాలకు అడ్డుకట్ట పడ బోదని రుజువవుతోంది. దేశంలో ఎక్కడ ఏ మూలనైనా లైంగిక హింస, స్త్రీలపై దాడులు, హత్యాచారాలను ఉక్కుపాదంతో అణచి వేసేలా సత్వర విచారణ, కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం సర్వ సన్నద్ధమై ఉండాలి. మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర యాజమాన్యాలు లైంగిక వ్యాఖ్యానాలు స్త్రీలను కించ పరిచేలా కథనాలను అనుమతించరాదు. వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అశ్లీల వెబ్‌సైట్‌లను ప్రభుత్వం నిషేధించాలి. మద్యాన్ని అంచెలంచెలుగా నిరోధించాలి. చట్టాలను పేద, గొప్ప తారతమ్యం లేకుండా కఠినంగా అమలు చేసిన నాడు చాలావరకు ఈ హత్యాచారాలను నిరోధించగలం. ఈ విధమైన ఆలోచనల వైపుగా ప్రభుత్వ రంగం కదులుతుందని ఆశిద్దాం. ✤



# బాలల దినోత్సవం

సల్మా హుమేరా

''భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అల్లాహ్ ప్రభువు. ఆయన తాను కోరిన దానిని సృష్టిస్తాడు. తనకు ఇష్టమైన వారికి కూతుళ్ళనూ, తాను కోరినవారికి కొడుకులనూ ఇస్తాడు. తనకు ఇష్టమైన వారికి కొడుకులనూ, కూతుళ్లనూ కలిపి ఇస్తాడు. తాను కోరినవారికి అసలు సంతానమే ఇవ్వడు. ఆయనకు అంతా తెలుసు, ఆయనకు అన్నిటిపైనా అధికారం ఉన్నది''

**(అష్ షూరా 49 - 50)**

''ప్రతి బిడ్డ పుట్టుకతోనే ఆశావాది. అతడు బంగారు కలలు కంటాడు.''అన్నారు స్వామి వివేకానంద బాలల గురించి.

''ఒక పుస్తకం, ఒక కలము, ఒక బాలుడు, ఒక ఉపాధ్యాయుడు ఈ ప్రపంచాన్ని మార్చగలరని మనం గుర్తుంచుకోవాలి'' - మలాలా యూసుఫ్ జాయ్.

బాల్యం అనేది ఈ భూమి మీద పుట్టిన ప్రతి మనిషికి దైవం ఇచ్చిన ఓ అమూల్యమైన వరం. అభం శుభం తెలియని బాల్యం, బాలల బోసినవ్వులు, వారి అమాయకత్వం, ఆ పసి మనసులు పూతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులు మాదిరిగా తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ప్రకాశవంతం చేస్తాయి.

స్వతంత్ర భారతదేశానికి మొదటి ప్రధాన మంత్రి, పండిట్

జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజైన నవంబర్ 14 న ప్రతి సంవత్సరం భారతదేశంలో బాలల దినోత్సవం / బాల్ దివస్ జరుపుకుంటారు. నెహ్రూకు పిల్లలతో వున్న సంబంధాన్ని తెలుపుతూ ఈ ఉత్సవం జరుపుకుంటారు. పిల్లలు నెహ్రూను చాచా నెహ్రూ అని ప్రేమగా పిలిచేవారు. "నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలు. వారిని మనం పెంచే విధానమే మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అనేవారు నెహ్రు. బాలలే దేశ భవిష్యత్తు, వారే సమాజానికి పునాది అనే విషయంపైనే ఆయన దృష్టి కేంద్రీకరించారు. 1955లో బాలల సమస్యలకు వేదికగా నిలిచేందుకు 'చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు.

5 నవంబర్, 1948న, మొదటి బాలల దినోత్సవాన్ని "ఫ్లవర్ డే"గా పాటించారు. United National Appeal for Children (UNAC) కోసం నిధులను సేకరించడానికి "పువ్వుల టోకెన్ల"ను విక్రయించారు. ఇది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ చైల్డ్ వెల్ఫేర్ (ICCW) చేసిన ప్రయత్నం. ఆ కారణంగా మొదటి బాలల దినోత్సవాన్ని "ఫ్లవర్ డే"గా అభివర్ణించారు. 1951లో, యునైటెడ్ నేషన్స్ సామాజిక సంక్షేమ పరిశోధకుడైన V. M. కులకర్ణి UK లో బాల్య నేరస్థుల పునరావాసంపై అధ్యయనం చేస్తున్నప్పుడు, భారతదేశంలోని అణగారిన పిల్లలను చూసుకునే వ్యవస్థ లేదని గ్రహించారు. "సేవ్ ది చైల్డ్ ఫండ్" కోసం విరాళాలు సేకరించడానికి ఇంగ్లాండ్ మహారాణి క్వీన్ ఎలిజబెత్-II పుట్టినరోజున జరిగిన Flag Day నుండి ప్రేరణ పొందిన కులకర్ణి, భారతదేశంలో పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న NGOల కోసం నిధుల సేకరణ కోసం పండిట్ నెహ్రూ పుట్టిన రోజును Flag Dayగా గుర్తించాలని సిఫార్సు చేస్తూ ఒక నివేదికను సమర్పించారు. ఈ నివేదికపై నెహ్రూ సమ్మతిని కోరినప్పుడు, ఆయన మొదట తటపటాయించినప్పటికీ, చివరికి అయిష్టంగానే ఒప్పుకున్నారు. 1954లో నెహ్రూ జన్మదినాన్ని తొలిసారిగా బాలల దినోత్సవంగా ఢిల్లీలోని నేషనల్ స్టేడియంలో జరుపుకున్నారు. 1957లో, ప్రత్యేక ప్రభుత్వ శాసనం ద్వారా భారతదేశంలో నవంబర్ 14ను అధికారికంగా బాలల దినోత్సవంగా ప్రకటించారు. భారత ప్రభుత్వ తంతి తపాలా శాఖ "బాలల దినోత్సవం" సందర్భంగా మొదటి రోజు కవర్లు, మూడు స్మారక స్టాంపులను విడుదల చేసింది. భారతదేశంలో బాలల దినోత్సవం మొదటిసారిగా నవంబర్ 20న గుర్తించబడింది, ఇది ఐక్యరాజ్య సమితి ప్రపంచ బాలల దినోత్సవాన్ని పాటించే రోజు. ఏది ఏమైనప్పటికీ, 1964లో జవహర్లాల్ నెహ్రూ మరణించిన తర్వాత, నెహ్రూ పుట్టిన రోజైన నవంబర్, 14ను బాలల దినోత్సవంగా గౌరవించాలని భారత పార్లమెంటు తీర్మానం చేసింది. ఆ రోజు నుండి ఈ రోజు వరకూ నవంబర్ 14నే మనం బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

ఇస్లాంలో, పిల్లలను అల్లాహ్ తరపు నుండి కలిగిన ఒక ఆశీర్వాదంగా పరిగణిస్తారు. ఆడపిల్ల అయినా, మగపిల్లవాడు అయినా వారు దేవుని ఆశీర్వాదాలే. వారి పెంపకం ఒక ముఖ్యమైన బాధ్యతగా పరిగణించబడుతుంది. పిల్లల పెంపకపు బాధ్యత విషయంలో ఏదైనా బాధ్యత విస్మరించినట్లైతే, తల్లితండ్రులు / సంరక్షకులు దైవానికి సమాధానం కూడా ఇవ్వవలసి ఉంటుంది. ఇస్లాంలో నిర్దిష్ట "బాలల దినోత్సవం" లేనప్పటికీ, ఖురాన్, హదీసులు పిల్లల పట్ల దయ, కరుణ, న్యాయంతో వ్యవహరించడం ప్రాముఖ్యతను నొక్కిచెప్పాయి. పిల్లలను పెంచే విషయంలో తల్లిదండ్రుల కోసం/సంరక్షకులు కోసం కొన్ని నియమాలు కూడా రూపొందించబడ్డాయి. తల్లితండ్రులు తమ పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి, చిన్ననాటి నుండే వారికి ధార్మిక విలువలను, నైతికతలను బోధించాలి, ఇహపరలోకాల సాఫల్యం కలిగే విధంగా బాలలకు ఉన్నతమైన విద్యను, జ్ఞానాన్ని అందించేందుకు కృషి చేయాలి. కేవలం శారీరకంగానే కాదు పిల్లలను మానసికంగా కూడా పరిపక్వత సాధించే విధంగా వారిని తీర్చిదిద్దాలి. కొన్ని ముస్లిం-మెజారిటీ దేశాల్లో, జాతీయ బాలల దినోత్సవం లేదా సార్వత్రిక బాలల దినోత్సవం పేరుతో నవంబర్ 20న వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే ఇవి ఇస్లామిక్-నిర్దిష్ట వేడుకలు కావు. కేవలం సామాజిక బాధ్యతతో చేసే వేడుకలు మాత్రమే. రంజాన్, బక్రీద్ మినహా ఇస్లాంలో మరే వేడుక లేదనేది నిర్వివాదాంశం.

బాలల హక్కులు, విద్య గురించి అవగాహన పెంచడం, వారిని పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం, తద్వారా వారి శ్రేయస్సు మరియు అభివృద్ధిని ప్రోత్సహించడం మొదలైనవి మన బాలల దినోత్సవం ప్రాధాన్యతలు.

బాలల దినోత్సవం ముఖ్యంగా బాలల సంరక్షణ, విద్య, వారికి ఆరోగ్యవంతమైన బాల్యాన్ని అందించడంలో అధిక ప్రాముఖ్యతను ఇస్తుంది. ప్రజల్లో కూడా ఒకప్పుడు ఈ సమస్యలే పెద్ద సమస్యలుగా కనిపించేవి. అందువల్ల బాలల దినోత్సవం నిర్వహించడానికి గల ప్రాముఖ్యత, దాని పరిధి చాలా తక్కువగా ఉండేది. కానీ మారుతున్న దేశ కాలమాన పరిస్థితుల రీత్యా, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత రీత్యా, ఇప్పుడు ఆ పరిధి పెరిగింది. కరోనా మహమ్మారి తర్వాత ఆర్థిక అసమానతల విషయంలో కూడా భారీ మార్పులు వచ్చాయనేది నిజం. ఈ సవాళ్ళ అంశాలపైనే బాలల భవితవ్యాన్ని నిర్ధారించవలసి ఉంటుంది. బాలల కోసం కేవలం కొన్ని పనులు నిర్వహించడానికి మాత్రమే కాదు ఈరోజు అన్ని రంగాల్లోనూ బాలల

సుస్థిరాభివృద్ధి సాధించడానికే ఈ బాలల దినోత్సవం అనేది ఒక వేదికగా మారాలనేది మనకు స్పష్టంగా అర్థం అవుతోంది. కుటుంబాల అభివృద్ధి, సమాజ శ్రేయస్సు, తద్వారా దేశప్రగతికి దోహదపడే ఉత్తమ పౌరులను రూపొందించే పునాది కాలమే నేటి బాలల దినోత్సవం అని మనకు ఈ సవాళ్ళన్నీ గుర్తు చేస్తున్నాయి.

బాలల మెదడు ఎటువంటి వికారాలు లేని ఒక పరిశుద్ధమైన పాల గిన్నె వంటిది. అందులో ఏమాత్రం అశుద్ధం కలిసినా మొత్తం జీవితమే నాశనమవుతుంది. అందుకే ఎటువంటి అవలక్షణాలకు ఆస్కారమివ్వని జీవితాన్ని వారికి వారి బాల్యంలోనే అందించాలి. లేదంటే మొక్కై వంగనిది మ్రానై వంగునా అనే సామెత మాదిరిగా బాలల జీవితాలు భవిష్యత్తులో మన చేయి జారిపోయే అవకాశం ఉంది.

ఇక ఇస్లామిక్ పేరెంటింగ్ విషయంలో పిల్లల అభివృద్ధి, ధార్మిక విలువలు, నైతిక ప్రవర్తన, సామజిక సంబంధాలు మొదలైనవి పిల్లలకు నేర్పే విషయంలో తల్లితండ్రులు, సంరక్షకులు లేదా గురువులు చాలా కీలకమైన పాత్ర పోషించవలసి ఉంటుంది. తల్లి ఒడిలోనే ఆధ్యాత్మిక వృద్ధి, నైతిక స్వభావం, మేధస్సు, భావోద్వేగాలకు బీజాలు వెయ్యాల్సి ఉంటుంది. విద్య విషయానికి వస్తే భౌతిక విద్య కంటే ముందే ధార్మిక విజ్ఞానం, నైతిక విలువలు, సత్ప్రవర్తనతో కూడిన జీవిత నైపుణ్యాలను బోధించాలి. శుద్దీకరణ విషయంలో కూడా ఇస్లాం చాలా గట్టిగా తాకీదును చేస్తుంది, తర్ఫీదును కూడా ఇస్తుంది. అది శారీరక శుద్దీకరణ కావచ్చు. మానసిక శుద్దీకరణ కావచ్చు. పిల్లలకు బాల్యం నుండే స్వీయ - క్రమశిక్షణను, శారీరక, మానసిక, నైతిక స్వచ్ఛతను అలవాటు చేయాలి. అంతేకాదు పిల్లల శారీరక, మానసిక భావోద్వేగాల పరిపక్వత కోసం కావలసిన ప్రశాంతమైన వాతావరణాన్ని మనమే కల్పించాలి. పొందిన సహాయానికి కృతజ్ఞత చెల్లించడం, పెద్దల ముందు వినయ విధేయతలు పాటించడం, స్వచ్ఛంద దాతృత్వం, స్వచ్ఛంద సేవా గుణాలను ప్రోత్సహించాలి.

బాలల విద్య, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం, సురక్షితమైన వాతావరణం, బాలల హక్కుల కోసం పోరాటం చేయడంతో పాటు ఇతర హక్కుల గురించి అవగాహన పెంచడం, బాలలను పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం పిల్లల శ్రేయస్సు, అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి పనులవరకే బాలల దినోత్సవం పరిమితం కాకుండా బాలల దినోత్సవం నిర్వహించవలసిన ఆవశ్యకత ఉన్న అంశాల జాబితా పెంచాలి. బాలల్లో సృజనాత్మకతను, ప్రతిభను, ప్రత్యేక సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయడం, తద్వారా బాలల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, బాల కార్మికులు వంటి ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి అవగాహన పెంచడం, బాలల శారీరక భద్రత, ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించడం, ఈ డిజిటల్ యుగంలో, సైబర్ బెదిరింపులు, ఆన్‌లైన్ వ్యవహారాలను, సాంకేతికతను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడం గురించి బాలల్లోనూ, వారి సంరక్షుల్లోనూ అవగాహన పెంచడానికి బాలల దినోత్సవం నిర్వహించవలసిన ఆవశ్యకత ఉంది.

సత్ప్రవర్తన అందజేయడం, జ్ఞానార్జన పొందే అవకాశాలు కల్పించడం మొదలైనవి తల్లితండ్రుల నుండి పిల్లలకు హక్కులుగా పరిగణించబడతాయి. పిల్లల మనస్తత్వం ఎలా ఉంటుందంటే, వాళ్ళు ప్రతీ దాన్ని గమనించడం ద్వారా నేర్చుకుంటారు. మాతృభాష నేర్చుకునే విషయంలో ఇది మనందరికీ తెలుసు. అంటే ఈ విధంగా గమనించే వయస్సులో పిల్లలు వారి వారి తల్లితండ్రులతోనే ఉంటారు. అందువల్ల ప్రతీ కుటుంబం లోనూ పిల్లల శిక్షణ వారి కుటుంబాల ద్వారానే జరగాలి. భార్యా భర్తలు ఇంట్లో ప్రవర్తించే విధానం వారి పిల్లల మానసిక ప్రవర్త నపై అధిక ప్రభావాలను చూపిస్తుంది. అందువల్ల ఇంట్లోనే పిల్లల మానసిక అభివృద్ధికి కావలసిన మంచి వాతావరణం కల్పించాలి.

బాలలను భవిష్యత్తులో భావి భారత నాయకులుగా తీర్చిదిద్దడానికి ఈ బాలల దినోత్సవం అనేది అందరికీ ఒక సామాజిక రిమైండర్. పేదరికం, ఆరోగ్య సంరక్షణ, విద్య లేకపోవడం, బాల కార్మికుల ప్రాబల్యం మొదలైనవి ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు. వీటిని వెలుగులోకి తీసుకు రావడమే కాకుండా వాటికి పరిష్కారాలను కూడా అందించే విధంగా ఉండాలి ఈ బాలల దినోత్సవం.

పిల్లల పెంపకం అనేది దైవం మనపై ఉంచిన బాధ్యత కూడా. వంశ రక్షణ అనేది ఒక పవిత్రమైన బాధ్యత. అది ఆ బిడ్డ పుట్టక ముందే ప్రారంభమవుతుంది. అందుకే వివాహం చేసుకునేటప్పుడు అందం, ఆస్థి కాకుండా తన జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడే వారిలో ధార్మికతను చూసి వివాహం చేసుకోమంటోంది ఇస్లాం. ఏ విత్తనం నాటితే అదే మొక్క మొలుస్తుంది. తల్లితండ్రులిద్దరూ ధార్మికులు, సత్ప్రవర్తన కలిగిన వారు అయినప్పుడు వారికి పుట్టే పిల్లలు కూడా వారి మాదిరిగా అవుతారని చెప్పడంలో సందేహం లేదు. పిల్లల పెంపకం విషయంలో తల్లితండ్రుల బాధ్యత కొంచెం క్లిష్టమైనదే అని చెప్పాలి. ఈ బాధ్యత నిర్వహించడంలో సఫలమైనా, విఫల మైనా రేపు ప్రళయ దినం రోజు దైవానికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఒకవేళ తల్లితండ్రులు విఫలమైనట్లయితే ఆ రోజున తల్లితండ్రులను

నిందించడానికి వారి పిల్లలే ప్రయత్నిస్తారు. పిల్లలు తమ తల్లిదండ్రులను వారికి సరైన మార్గదర్శకత్వం లేకుండా చేసిన వారిగా చూపుతున్నారు. అందువల్ల ఇక్కడ జాగ్రత్తగా ఉండవలసింది పిల్లల కంటే ముందు వారి తల్లితండ్రులే.

దివ్య ఖుర్ఆన్ 66: 6-7 "విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుంటుంబ సభ్యులనూ మానవులు, రాళ్లు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి. దానిపై ఎంతో బలిష్ఠులు, అత్యంత కఠినులు అయిన దైవదూతలు నియమించబడి ఉంటారు. వారు ఎన్నటికీ అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించరు, వారు తమకు ఏ ఆజ్ఞ ఇచ్చినా, దానిని పాటిస్తారు. (అప్పుడు ఇలా అనటం జరుగుతుంది), "అవిశ్వాసులారా! ఈనాడు సాకులు చెప్పకండి, మీరు చేస్తూ ఉండిన చేతలకు తగినట్టుగానే మీకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది."

ముఖ్యంగా ఈరోజు తల్లితండ్రులు లేదా సంరక్షకులు చేస్తున్న పెద్ద తప్పు ఏమిటంటే పిల్లలపై అధిక ప్రేమ, వాత్సల్యం, గారాబం అనే ముసుగులో పిల్లలను బాధ్యత తెలియనివారిగా, చేతగాని వారిగా తయారుచేయడం. ఈరోజు మొబైల్ ఫోన్, ఇంటర్నెట్, అనారోగ్యకరమైన ఆహార పద్ధతుల పుణ్యమా అని పిల్లలకు ఎటువంటి శారీరక, మానసిక వ్యాయామం ఉండడం లేదు. ఈ కారణంగా పిల్లలు డమ్మీలుగా తయారవుతున్నారు. ఆలోచించే మెదడును, పనిచేసే శారీరక సామర్ధ్యాన్ని కోల్పోతున్నారు. సమస్యలకు పరిష్కార నైపుణ్యాలను కోల్పోతున్న కారణంగా ఏ చిన్న సమస్య వచ్చినా ఆత్మహత్యలకు లేదా నేరాలకు పాల్పడుతున్నారు. పోటీ ప్రపంచంతో పరుగులు పెట్టి గెలవాలనే తలంపుతో శారీరక, మానసిక విశ్రాంతికి దూరమవుతున్నారు. ఇది బాలల భవిష్యత్తుకు చేటు మాత్రమే కాదు కుటుంబ విలువలకు, మన దేశప్రగతికి కూడా ముందు ముందు చాలా అవాంతరాలను తెచ్చిపెడుతుంది. పిల్లలపై మనం చూపించాల్సిన ప్రేమ, వారిపై మనకున్న బాధ్యతలు, అధికారాలు, తద్వారా వారి జీవితాలను తీర్చి దిద్దాల్సిన చర్యలు మొదలైన విషయాలన్నింటిపై మనకు స్పష్టమైన అవగాహన ఉండాలి. అందుకు తగ్గట్టుగానే పిల్లలకోసం మనం గానీ, మన ప్రభుత్వాలు గానీ తీసుకునే చర్యలు ఉండాలి. అప్పుడు మాత్రమే "నేటి బాలలు", "రేపటి వారి భవిష్యత్తు" అనే ఈ రెండింటి విషయంలో సరైన సమతుల్యం ఏర్పడుతుంది. మన జీవితాలను త్యాగం చేసి అయినా మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. **"మన పిల్లల రేపటి ఉత్తమ భవిష్యత్తు కోసం మనం మన నేటిని త్యాగం చేద్దాం." అని ఏపీజే అబ్దుల్ కలాం అన్నారు.** ✤

# రహమతుల్ లిల్ ఆలమీన్

**అర్షియా జబీన్**

ఓ ప్రవక్త –నా ప్రియ ప్రవక్త
నీ అడుగుజాడలలోనే సాఫల్యం
నీ మాటే నాకు శరణ్యం
ప్రళయదినం నిన్ను చూడాలనే కోరిక నాకు
నీ చేతితో ఆబె కౌసర్ తాగాలని కోరిక నాకు

అనాధలపట్ల ఆత్మబంధువువి భార్యల పట్ల మృదుస్వభావివి
పిల్లల పట్ల ప్రేమశీలివి నలుగురు కూతుర్ల ఆత్మరక్షణవి

ఉమ్మత్ కోసం రాత్రంతా ఏడ్చి దువాలు చేసిన మహనీయుడివి,
వడ్డీ నీ శరీరాన్ని దహించే అగ్ని అని హెచ్చరించిన
శ్రేయోభిలాషివి,
బాబాయి గుండెని చీల్చి
నమిలిన హిందానే మన్నించి వదిలేసిన మహానుభావుడివి,
యుద్ధాలలో నీ దంతాలు కోల్పోయిన ,
నీ సైనికులను కోల్పోయిన,
నీకు కష్టం కలిగిన,
నష్టం కలిగిన,
బందీలుగా ఉన్న ఖైదీలతో నిరక్షరాశులకు చదువు చెప్పించి
జ్ఞాన దీపాన్ని వెలిగించిన జ్ఞానుడివి,

ఆడపిల్లలు స్వర్గపు రహదారులని, వారిని ప్రేమానురాగాలతో
పెంచాలని వారితో కఠినంగా వ్యవహరించవద్దని చెప్పిన
దయాస్వరూపిడివి ,
తాయెఫ్ లో రక్తసిక్తమైన ,ఒంటె పేగుల భారాన్ని
మోయలేకపోయినా, చెత్త వేసిన, – అపనిందలు మోపిన,
మారు మాట్లాడక చిరునవ్వు నవ్వి వారికోసం దువాలు చేసిన
దయాసాగరుడివి

శాంతి ప్రేమలతో పూర్తి సమాజాన్ని మార్చిన ధీరోదాత్తవి,
మానవీయ– నైతిక సమాజమే లక్ష్యంగా ఒక గొప్ప సమాజానికి
నాందివేసిన కిరీటం లేని చక్రవర్తివి, జీవితమనే తెల్ల కాగితంపై
ఇంకు మరకలు పడకుండా ఎలా బ్రతకాలో ఎలా నడవాలో –
ఎలా తినాలో–
ఎలా మాట్లాడాలో –
ఎలా సహించాలో–
ఎలా భరించాలో
నీ జీవితంలో ఆచరించి చూపిన ఓ మహా అద్భుత కావ్యానివి
నీవు రహమతుల్ లిల్ ఆలమీన్




# నమ్మక ద్రోహం

పర్వీన్ సుల్తానా, విజయవాడ

**మనిషి సంఘ జీవి.** ఇష్టం ఉన్నా లేకున్నా ఇతరులతో కలసి జీవించాల్సిందే. కపట వ్యక్తులు, దుష్ట స్నేహితులకంటే ఒక క్రూర మృగం మెరుగైనది. ఎందుకంటే క్రూరమృగం శరీరాన్ని మాత్రమే గాయపరుస్తుంది. కానీ ఒక కపట వ్యక్తి, దుష్ట స్నేహితుడు లేదా మనం బాగా నమ్మకం పెట్టుకున్నవాళ్ళు మనల్ని మోసం చేస్తే, మనసు గాయపడటమేకాకుండా మన మీద మనకే అసహ్యం వేస్తుంది. జీవితం మీద, ఈ ప్రపంచం మీద విరక్తి కలుగుతుంది.

మోసం చేయడం, మోసపోవడం ఈ రెండు ఈ రోజుల్లో సర్వ సాధారణమైపోయాయి. ఒక మనిషి నమ్మకద్రోహం చేయడానికి కారణాలు మూడు. 1) ఈర్ష్య 2) దురాశ 3) స్వార్థం. వ్యక్తి నమ్మకద్రోహం ఎప్పుడు చేస్తాడంటే నేను చేసేది ఎవరూ చూడట్లేదు అని, ఎవరికి తెలియదు అని, నేను చేసిందే సరైనది అని అనుకుని అజ్ఞానంతో ఇతరులను మోసం చేస్తారు. ఒకవేళ దొరికిపోతే రకరకాల కారణాలతో కప్పిపుచ్చుతారు దాన్నుండి తప్పించుకోవడానికి. కానీ ప్రతి మోసం వెనుక ఏదో ఒక కారణం ఉంటుంది. జీవితంలో ఎప్పుడో ఒకసారి నమ్మకద్రోహానికి లోనవుతారు. దాన్ని ఫేస్ చేసిన తరువాత జీవితం ఇంకోలా కనిపిస్తుంది. ఈ ఛీటింగ్ (నమ్మకద్రోహం) తట్టుకోలేక అనేక మంది ఆత్మహత్య ప్రయత్నం చేసినవాళ్లు, ఆత్మహత్య చేసుకున్నవాళ్లు ఉన్నారు. ఈ మోసాన్ని తట్టుకోలేక కుటుంబ జీవితం కానీ, ప్రొఫెషన్‌లో కానీ తమను తాము నాశనం చేసుకున్న వారు ఉన్నారు. ఇది కంటికి కనపడని చాలా పెద్ద సమస్య. తెలియనివారు చేస్తే బాధ అంత ఉండదు. మన దగ్గరి స్నేహి తులు, మనకు తెలిసినవాళ్లు, మన వెంటే ఉండి మనతో లాభం పొందినవాళ్ళు చేస్తే బాధ ఎక్కువగా ఉంటుంది. మన అనుకున్న దగ్గరి సంబంధాల వారు మోసం చేస్తే చాలా దుర్భరంగా ఉంటుంది పరిస్థితి. తెలియనివాళ్లు మోసం చేస్తే తెలియకుండానే మరిచిపోతాం. తెలిసినవాళ్ళు చేస్తే ఆ బాధ మరిచిపోవడం కష్టం. మితిమీరిన నమ్మకం చాలా ప్రమాదకరం. నమ్మకం ఎంతగా బలపడితే నమ్మకద్రోహం అంతే బలంగా మనల్ని కుదిపేస్తుంది.

మనతోనే ఉండి, మన నీడలా ఉండి, సహాయం చేస్తారని, మనకు కష్టం వచ్చినప్పుడు మనకు తోడుగా ఉంటారని అనుకున్నవాళ్ళే ఎక్కువగా మోసం చేస్తారు. ఎంతటి నమ్మకస్తులకైనా మన రహస్యాలను తెలుపకూడదు. మన గురించి మొత్తం తెలిసినవారే మన జీవితానికి హాని కలిగిస్తారు. నమ్మకం అనేది చిన్న పదమే, దీనిని చదవడానికి క్షణం పడుతుంది. ఆలోచించడానికి నిమిషం పడుతుంది. అర్థం చేసుకోవడానికి ఒకరోజు పడుతుంది. కానీ నమ్మకమనే చిన్న పదం నిరూపించుకోవడానికి జీవిత కాలం పడుతుంది. డబ్బు పోతే సంపాదించుకోగలం కానీ నమ్మకం ఒకసారి ఒకరి మీద నుండి పోయిందంటే దానిని నిరూపించు కోవడానికి జీవిత కాలం సరిపోదు. బంధం ప్రతి ఒక్కరితో పెట్టుకోవచ్చు, కానీ ఆశ మాత్రం ఆ దైవంపైనే ఉండాలి. మనిషి ఎదుటివారిపై పెట్టుకున్న ఆశల వల్లనే మోసపోవడం జరుగుతుంది. నటించే మనుషులు ఉన్నంత కాలం, నిజాయితీగా ఉండేవారు ఓడిపోతూనే ఉంటారు. మనిషికి బాధ కలిగించడానికి బయట ప్రపంచంలో చాలా విషయాలు ఉండవచ్చు. కానీ నమ్మకద్రోహం అన్నిటికంటే ఎక్కువ బాధను కలిగిస్తుంది. నిజాయితీగా ఉండటం కూడా

ఒక యుద్ధం లాంటిదే. యుద్ధంలో ఒంటరిగా నిలబడటం ఎంత కష్టమో, నిజాయితీగా ఉండటం కూడా అంతకన్నా ఎక్కువ కష్టం. ఈనాటి సమాజంలో నిజాయితీపరులను పిచ్చివాళ్ళుగా పరిగణిస్తున్నారు. నిజ జీవితంలో ఇలా ఎదురయ్యేవారంతా మనకు గురువులే. మంచివాళ్లు పాఠం నేర్పిస్తారు. చెడ్డవాళ్ళు గుణపాఠం నేర్పిస్తారు. ఒక మంచి ఆలోచన కనీసం పది చెడు ఆలోచనల్ని మంచి వైపుకి మళ్ళిస్తుంది. కానీ ఒక చెడు ఆలోచన వేయి మంచి ఆలోచనల్ని కలుషితం చేస్తుంది. ఈ ప్రపంచ జీవితంలో చాలామంది ఒకరికొకరు నమ్మకద్రోహం చేసుకుం టుంటారు. ఇలాంటి వారిని నేడు సమాజంలో తప్పుగా పరిగణించడం లేదు. పైగా ఇలాంటి వారిని చాలా తెలివైనవారిగా పరిగణిస్తున్నారు. స్వయంగా ఇతరులకు ద్రోహం చేసినవాడు నేను చాలా తెలివైన వాడిని అనిఅనుకుంటున్నాడు. కానీ ఇది చాలా పెద్ద తప్పు అని గమనించటంలేదు. ఇతరులకు నష్టం చేకూర్చే పని అది డబ్బు అయినా, పరువు ప్రతిష్ట అయినా, ఏ రకంగా అయినా ఇతరులకు హాని, బాధ కలిగించే చర్యను ఆ దైవం క్షమించడు.

ప్రవక్త(స) వారు ఒక హదీసులో ఇలా పేర్కొన్నారు: "నమ్మక ద్రోహం చేసేవాడు, ఇచ్చిన మాటను నిలబెట్టుకోనివాడు, ప్రళయ దినం రోజున ఒక పతాకం పెట్టి ఇది ఫలానా మనిషి నమ్మక ద్రోహం అని ఆ పతాకంపై ఆ వ్యక్తి పేరు వ్రాసి ఎగురవేయ బడుతుంది" (బుఖారీ 6177). ఇహలోకంలో కేవలం కొంత మంది ముందు అవమానం జరిగితేనే సహించలేం ప్రళయదినం రోజు మొట్టమొదటి మానవుని నుండి చిట్టచివరి మానవుడి వరకు ఉంటారు. ఇంతటి అవమానం సహించగలమా? ఆలోచించాలి.

ఇంకొక హదీసులో ప్రవక్త(స) ఇలా తెలిపారు : "మోసం చేసే వాడు ముస్లిం కాజాలడు" (ముస్లిం)

మోసం వలన ఎదుటివారికి బాధ కలుగుతుంది కాబట్టి ఇలాంటి గుణం కపట విశ్వాసుల గుణం అని తెలుసుకోవాలి. అందువల్ల స్నేహంలోగానీ, సంబంధాలలోగానీ, వ్యాపార లావాదేవీలలో గానీ, ఉద్యోగంలో గానీ, ఇరుగు పొరుగు సంబంధాలలో గానీ ఎలాంటి విషయాలలోనైనా ప్రతి వ్యక్తి ప్రత్యేకించి విశ్వాసి ఇలాంటి నమ్మకద్రోహ చర్య నుండి దూరంగా ఉండాలి. ప్రళయదినం రోజు ప్రతి చర్యకు జవాబు చెప్పుకోవాలి అనే ఆలోచన ప్రతి విశ్వాసి గుర్తించి నడుచుకోవాలి. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఎవరినైనా మోసం చేయగలం, కానీ మనందరిని సృష్టించిన సృష్టికర్తను ఎవరూ మోసం చేయలేరు సుమా! దివ్యగ్రంథంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

"మేము అల్లాహ్ పట్ల అంతిమ దినం పట్ల విశ్వాసం కలిగి ఉన్నామని కొందరంటారు. కానీ యధార్థానికి వారు విశ్వసించిన వారు కారు. వారు అల్లాహ్‌ను, విశ్వాసులనూ మోసపుచ్చు తున్నారు. కానీ యధార్థానికి వారు తమను తామే మోసపుచ్చు కుంటున్నారు. కానీ ఈ విషయాన్ని వారు గ్రహించటంలేదు. (2: 8,9)

సమాజంలో మోసానికి గురైన వారిలో చాలామంది తమ జీవితా లను నాశనం చేసుకుంటున్నారు. ఒకసారి జరిగిన మోసం గురించి తమ జీవితాలను అథఃపాతాళానికి త్రోసేస్తున్నారు. ఇలాంటి వారు ఒక విషయం గమనించాలి. ఒకరు మనకు ద్రోహం చేస్తే దాని గురించే ఆలోచిస్తూ కుటుంబ సభ్యులను వారిపై ఆధారపడ్డ వారిని నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసం? పాజిటివ్‌గా ఎందుకు తీసుకోలేకపోతున్నారు? ఇది మన జీవితం, వారి వలన మన జీవితంలో ఓడిపోకూడదు. మన జీవితం ఎందుకు నాశనం చేసుకోవాలి అనేది ఆలోచిం చాలి. ఎదురు దెబ్బలు తిన్నవాడు, నష్టాన్ని భరించిన వాడు మహనీయుడవుతాడు. ఓటమి, ఒంటరితనం, నమ్మక ద్రోహం చాలా నేర్పిస్తాయి. ఒకటి ఎలా గెలవాలో నేర్పిస్తాయి. ఇంకొకటి ఎవరిని నమ్మాలో ఎలా బ్రతకాలో నేర్పిస్తాయి. Cheet చేశారంటూ బాధపడటం కంటే దానిని teech టీచ్‌గా తీసుకుంటే జీవితంలో తిరుగుండదు.

## మోసం, ద్రోహం చేసే వ్యక్తి లక్షణాలు


- మన విషయాలన్నీ తెలుసుకుంటాడు. అతని విషయాలు అన్నీ దాస్తాడు. ఇతరులు చెప్తేగానీ తెలియదు. అడిగితే సులువుగా మరచిపోయాననంటాడు. మనకు ఎంతకాలం నుండి తెలిసినా అతని గురించి అంతగా తెలియదు.
- అబద్ధాలు చెబుతుంటారు. వారి మాటలకి చేసే పనులకు పొంతన ఉండదు. నిమిషానికో మాట మారుస్తూ చెప్పిన మాటపై నిలబడరు.
- ఒక అబద్ధపు వ్యక్తి మనల్ని మన ముందు పొగుడుతాడు. కానీ మన వెనకాల నలుగురిలో అగౌరవపరుస్తాడు.
- వాళ్ళు మంచి మాటలతో ఆకట్టుకుంటారు.అబద్ధపు ప్రమాణాలు చేస్తారు.
- వారు అవసరం కోసం మాత్రమే మాట్లాడతారు, లేకపోతే పలకరు.
- వాళ్ళు మనతో మంచిగా అనిపించినంత వరకే ఉంటారు. ఎప్పుడైనా ఏదైనా సమస్య వస్తే వదిలి వెళ్ళిపోతారు.

ఇలాంటి వ్యక్తులతో మనకు స్నేహం గానీ, పరిచయం గానీ ఉంటే చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా! జీవితంలో అనేక సమ స్యలు వస్తాయి. మనం సమస్యల్ని వేటాడాలా లేక సమస్యలు మనల్ని వేటాడేలా మారిపోదామా అన్నది మన ఆలోచన విధానంపై ఆధారపడి ఉంది.

జీవితం చాలా విలువైనది. ఆ దైవం ఈ జీవితానికి ఒక లక్ష్యం ఇచ్చాడు. ఈ ప్రపంచపు సుఖదుఃఖాలను ఎదుర్కొంటూ నిజ దైవాన్ని గ్రహించి ఆయన్ను ఆరాధించడంలోని మనిషికి ఇహపర లోకాల సాఫల్యం ఉన్నదని ప్రతి వ్యక్తి గ్రహించి,మానవులపై ఆశ పెట్టుకుని మోసపోకుండా అల్లాహ్‌పై అపార నమ్మకం, ఆశ కలిగి ఉండాలి. అప్పుడే ప్రపంచంలో గౌరవం, పరలోకంలో ఉన్నతమైన స్వర్గం లభిస్తుంది. అల్లాహ్ మనందరిని ఇలాంటి వారి నుండి కాపాడాలని ఆశిద్దాం... ✤

# రతన్ నావల్ టాటా

డా॥ అపర్ణ, డైటీషియన్



**"టాటా"-** ఇది మనందరకూ సుపరిచితమైన పేరు. ఈ పేరు పలకకుండా బహుశా ఒక్కరోజు కూడా మనకు గడవదంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే, టాటా ఉత్పత్తులతో మన జీవితాలు అంతగా పెనవేసుకుపోయాయి. ''టాటా'' అనేది కేవలం వస్తువులకు బ్రాండ్ నేమ్‌గా మాత్రమే కాదు భారతదేశంలో ఒక గ్రూప్ అఫ్ ఇండస్ట్రీస్‌కి ప్రపంచ ప్రఖ్యాతిని తీసుకువచ్చిన దిగ్గజ పారిశ్రామికవేత్తగా, దాతృత్వంలో సువిశాలమైన మనసు కలిగిన ఒక దాతగా అందరి హృదయాల్లో నిలిచిపోయిన పేరు ఇది. ఆ పేరే ''రతన్ నావల్ టాటా''.

రతన్ నావల్ టాటా 28.12.1937న, బొంబాయిలో, ఒక పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో టాటా గ్రూపు వ్యవస్థాపకుడు జమ్షెడ్జీ టాటాకు మునిమనుమడుగా జన్మించారు. ఆయన తండ్రి నావల్ టాటా తల్లి సూని టాటా.

రతన్ టాటా 8వ తరగతి వరకు ముంబైలోని క్యాంపియన్ స్కూల్లో చదివారు. తరువాత ముంబైలోని కేథడ్రల్, జాన్ కానన్ స్కూల్, సిమ్లాలోని బిషప్ కాటన్ స్కూల్, ఆ తర్వాత న్యూయార్క్ నగరంలోని రివర్డేల్ కంట్రీ స్కూల్లో తన చదువును కొనసాగించారు. 1955లో ఉన్నత పాఠశాల నుండి పట్టభద్రులయిన తరువాత ఆయన అడ్వాన్స్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం ద్వారా కార్నెల్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుండి 1959లో ఆర్కిటెక్చర్లో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. కార్నెల్లో యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు, టాటా ఆల్ఫా సిగ్మా ఫై ఫ్రాటెర్నిటీలో సభ్యుడయ్యారు. 2008లో, కార్నెల్ యూనివర్సిటీకి 50 మిలియన్ల డాలర్లను బహుమతిగా ఇచ్చి, విశ్వవిద్యాలయ చరిత్రలో అతిపెద్ద అంతర్జాతీయ దాత అనే ఖ్యాతి సంపాదించారు టాటా.

1961లో టాటాలో చేరి, అక్కడ టాటా స్టీల్ షాప్ ఫ్లోర్లో పని చేశారు. 1970వ దశకంలో, రతన్ టాటాకు టాటా గ్రూప్లో నిర్వహణ సంబంధ పదవి ఇవ్వబడింది. ఆర్థిక మందగమనం సమయంలో కుప్పకూలిన అనుబంధ సంస్థ నేషనల్ రేడియో & ఎలక్ట్రానిక్స్ (NELCO)ను పైకి లేవనెత్తే విషయంలో ప్రారంభ విజయాన్ని సాధించారు. తర్వాత 1991లో J.R.D. టాటా పదవీ విరమణ చేసిన తర్వాత ఆయనకు వారసునిగా టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభంలో, సీనియర్ టాటా పదవీకాలంలో పెద్ద మొత్తంలో కార్యాచరణ స్వేచ్ఛను కలిగి ఉన్న వివిధ అనుబంధ సంస్థల అధిపతుల నుండి రతన్ టాటా గట్టి ప్రతిఘటనను ఎదుర్కొన్నారు. దానికి ప్రతిస్పందనగా, అధికారాన్ని ఏకీకృతం చేయడానికి రూపొందించిన అనేక విధానాలను అమలు చేశారు. వాటిలో ముఖ్యమైనవి పదవీ విరమణ వయస్సు నిర్ధారణ, నివేదికలను అనుబంధ సంస్థలు నేరుగా గ్రూప్ కార్యాలయానికి నివేదించడం, టాటా గ్రూప్ బ్రాండ్‌ను పటిష్టం చేయడానికి అనుబంధ సంస్థలు తమ లాభాన్ని టాటా గ్రూప్‌కు అందించాలని సూచించారు. సరికొత్త ఆవిష్కరణలకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. యువ ప్రతిభావంతులకు అనేక బాధ్యతలను అప్పగించారు. ఆయన నాయకత్వంలో, అనుబంధ సంస్థల మధ్య, కంపెనీకి అనుబంధ సంస్థలకు మధ్య కార్యకలాపాలన్నీ క్రమబద్ధీకరించబడ్డాయి. ప్రపంచీకరణకు వీలుకాని వ్యాపారాలను ఆయన విడిచిపెట్టేశారు. ఆయన తన పదవీ కాలంలో, భారతదేశంలో కేంద్రీకృత సమూహంగా ఉన్న టాటా గ్రూప్‌ను విశ్వవ్యాపితం చేసే ఉద్దేశ్యంతో టెట్లీ, జాగ్వార్, ల్యాండ్ రోవర్, కోరస్లను కొనుగోలు చేయడం జరిగింది. ఆయన 1991 నుండి 2012 వరకు టాటా గ్రూప్ మరియు టాటా సన్సుకు ఛైర్మన్‌గా పని చేశారు. అక్టోబర్ 2016 నుండి ఫిబ్రవరి 2017

వరకు తాత్కాలిక ఛైర్మన్‌గా పనిచేశారు. టాటా ఛారిటబుల్ ట్రస్టులకు అధిపతిగా కొనసాగారు.

రతన్ టాటా 21 సంవత్సరాల నాయకత్వంలో టాటా గ్రూప్ ఆదాయం 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెంచారు. టాటా నానో కారు అభివృద్ధిని కూడా రూపొందించి భారతీయ వినియోగదారునికి అందుబాటులో ఉండే ధరలో కార్లను ఉంచారు. టాటా మోటార్స్ గుజరాత్‌లోని సనంద్ ప్లాంట్ నుండి టిగోర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ యొక్క మొదటి బ్యాచ్ను విడుదల చేసింది, దీనిని టాటా "ఫాస్ట్-ఫార్వర్డ్ ఇండియా ఎలక్ట్రిక్ కల"గా అభివర్ణించారు. టాటా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌కి అధినేతగా తన పాత్రను తనదైన శైలిలో పోషించారు.

రతన్ టాటా 30కి పైగా స్టార్టప్ కంపెనీలలో పెట్టుబడి పెట్టారు. ఇందులో చాలా వరకు వ్యక్తిగత సామర్థ్యంతో, మరికొన్ని పెట్టుబడి సంస్థ ద్వారా పెట్టడం జరిగింది. వాటిల్లో కొన్ని - భారతదేశంలోని ప్రముఖ ఇ-కామర్స్ వెబ్సైట్లలో ఒకటైన స్నాప్డీల్, ఆన్లైన్ ప్రీమియం ఇండియన్ టీ విక్రేత అయిన టీ బాక్స్, క్యాష్ కారో. కామ్ డిస్కౌంట్ కూపన్లు మరియు క్యాష్-బ్యాక్ వెబ్సైట్, ఓలా క్యాబ్స్ మొదలైనవి. ఏప్రిల్ 2015లో, చైనీస్ స్మార్ట్ఫోన్ స్టార్టప్ (Xiaomi)లో టాటా వాటాను కొనుగోలు చేసినట్లు నివేదించబడింది. ఆన్లైన్ రియల్-ఎస్టేట్ పోర్టల్ అయిన నెస్టావేలో పెట్టుబడి పెట్టారు. ఆన్లైన్ రియల్-ఎస్టేట్ మరియు పెట్-కేర్ పోర్టల్ డాగ్స్పాట్ను ప్రారంభించడానికి (Zenify)ని కొనుగోలు చేశారు.

సంపద అందరూ సంపాదిస్తారు. కానీ దాతృత్వం, మానవత్వం అనేది కొందరిలోనే ఉంటుంది. ఆ కొందరిలో రతన్ టాటా ముందంజలో ఉంటారు. భారతదేశంలో విద్య, వైద్యం మరియు గ్రామీణాభివృద్ధికి టాటా ఎంతగానో ఆర్థిక సహాయం చేశారు. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్‌కు ఎన్నో ప్రాంతాలకు మెరుగైన నీటిని అందించడానికి కెపాసిటివ్ డీయోనైజేషన్ను అభివృద్ధి చేయడానికి సహాయం చేశారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్ డియాగో (UC శాన్ డియాగో)లో టాటా హాల్ అనే ఒక అత్యాధునిక పరిశోధనా కేంద్రం 2018లో ప్రారంభించబడింది. UC శాన్ డియాగోకు 70 మిలియన్ డాలర్లు విరాళంగా అందించిన టాటా ట్రస్ట్ పేరుతో ఈ హాల్‌కు టాటా హాల్ అని పేరు పెట్టారు. 2016లో స్థాపించబడిన టాటా ఇన్స్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ అండ్ సొసైటీ (TIGS) భవనం కోసం ఈ విరాళం ఇవ్వబడింది. టాటా హాల్ అనేది నాలుగు అంతస్తుల భవనం, ఇది 128,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇందులో జీవ, భౌతిక శాస్త్రాల పరిశోధనా సౌకర్యాలు ఉన్నాయి.

సాధారణంగా ఏ కంపెనీ యజమాని అయినా తన క్రింద పని చేసేవారికి జీతాలు ఇవ్వడం వరకే తన బాధ్యత అనుకుంటాడు. కానీ రతన్ టాటా అందరు పారిశ్రామికవేత్తల్లా కాదు ఆయన తన ఉద్యోగుల బాగోగుల గురించి వ్యక్తిగత శ్రద్ధ తీసుకునేవారు. అందుకు ఉదాహరణ 26.11.2008న ముంబై తాజ్ హోటల్ పై జరిగిన ఉగ్రవాద దాడి. ఆ దాడిలో మరణించిన, గాయాల పాలైన ఉద్యోగుల పట్ల, వారి కుటుంబాల పట్ల, వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సు పట్ల ఆయన చూపించిన ఔదార్యం, ఆదరణే అందుకు ఉదాహరణ. క్యాన్సర్ పేషెంట్‌ల కోసం సుమారు 1000 కోట్ల రూపాయలు పైనే విరాళం ఇచ్చారు. కరోనా సమయంలో సుమారు 1500 కోట్ల రూపాయలు ప్రధాన మంత్రి సహాయ నిధికి అందించారు. చెప్పుకుంటూ పోతే టాటా పేరుతో ఈ దేశం, దేశప్రజలు పొందిన సేవలు లెక్కలేనన్ని ఉన్నాయి.

వైఫల్యం నుండి విజయాలు సాధించడం ఎలా అనేది మనం రతన్ టాటా నుండే నేర్చుకోవాలి. 1998లో ఇండికా కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఇండికా కారు తెచ్చిపెట్టిన నష్టాలకు ధీటైన సమాధానం చెపుతూ ఇండియా V2 కారును మార్కెట్‌లో ప్రవేశ పెట్టి, ఎటువంటి ఒడిదుడుకులనైనా తట్టుకుని వ్యాపారాన్ని నడిపించగలను అని నిరూపించారు ఆయన. ఇండికా V2కు మార్కెట్‌లో మంచి జనాదరణ దక్కింది. 1999లో ఇండికా కారు కారణంగా నష్టాలు చవిచూసి, టాటా షేర్స్ ఫోర్డ్ కంపెనీకి అమ్మజూపి, వారి నుండి అవమానాలు పొందిన టాటా గ్రూప్ అదే ఫోర్డ్ కంపెనీ నుండి జాగ్వార్, ల్యాండ్ రోవర్‌లను 2008 కొనడం నిజంగా ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.

నిబద్ధత, నిజాయతీ, నైతిక విలువలు, వ్యాపార విలువలు ఇవే రతన్ టాటా విజయ రహస్యాలు. ఆయన ఒక భారతీయ ప్రముఖ పారిశ్రామికవేత్త మాత్రమే కాదు, ఒక గొప్ప నాయకుడు, గొప్ప దాతృత్వం కలిగిన వ్యక్తి, ఒక్క మాటలో చెప్పాలంటే కోట్లాదిమందికి రోల్ మోడల్.

ఆయన ఈ దేశానికీ చేసిన సేవలకు గాను 2000 లో భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్, 2008 లో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ అందుకున్నారు. 2023 లో ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా, 2021లో అస్సాం బైభవ్, 2014లో గౌరవ నైట్ గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్, 2006 లో మహారాష్ట్ర భూషణ్ మొదలైన అవార్డులను కూడా పొందారు. ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసాయి.

75 ఏళ్లు నిండిన రతన్ టాటా 28.12.2012న టాటా గ్రూపులో తన కార్యనిర్వాహక అధికారాలకు రాజీనామా చేశారు. ఆయన తర్వాత టాటా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ బాధ్యతలు స్వీకరించిన వారు కూడా రతన్ టాటా నేర్పిన విలువలను, చూపించిన దాతృత్వ బాటను కొనసాగిస్తున్నారు.

వృద్ధాప్య సంబంధిత అనారోగ్యాల కారణంగా రక్తపోటు అకస్మాత్తుగా పడిపోవడంతో ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో అక్టోబరు 7 నుండి ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స పొందుతూ, 09.10.2024 తేదీన 86 ఏళ్ల వయసులో రతన్ టాటా తుదిశ్వాస విడిచారు. ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ✤



# మతం గొడుగెందుకు రాజకీయాలకు?

రేవూరి ప్రశాంతిమూర్తి

"మతం వద్దు, గితం వద్దు, మానవతే ముద్దు" అంటున్న బాల గేయం పదేపదే నా చెవుల్లోను, మనసులోనూ గింగుర్లు తిరుగు తోంది. పిల్లల్లారా! పాపల్లారా!! రేపటి భారత పౌరుల్లారా! అంటూ వారికి నేర్చుకోవటానికి, నేర్పించటానికి పెద్దలకు చక్కని విషయాలను ఇలాంటి బాల గేయాల ద్వారా వింటూ పాడుకుంటూ పెరిగిన తరంలోని వారికైనా ముందు వారికైనా, వెనుకవారికైనా, చిన్నలకైనా పెద్దలకైనా నేటి రాజకీయాల నుంచి నేర్పించడానికి గాని, నేర్చుకోవటానికి గానీ ఏమీ కనిపించటం లేదు. ఎందుకిలా జరుగుతోంది? ఏమిటి ఇలా జరగడానికి కారణాలు అని కొంచెం లోతుగా ఆలోచించి చూస్తే ప్రతి సామాన్య మానవునికి ఇలా అనిపించి ఎంతో బాధ కలుగవచ్చు.

## లౌకిక సామ్యవాద దేశం

మనకు స్వతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు దాటిపోయి 80కి దగ్గరగా వచ్చినా లౌకిక దేశం, సామ్యవాద దేశం, భిన్నత్వంలో ఏకత్వం అని చెప్పుకోవడానికే తప్ప మనం ఎన్నుకున్నామని అనుకుంటున్న ప్రజా ప్రతినిధులు రాజకీయ గద్దెలనెక్కి కూర్చో గానే అహంతో, అహంబావంతో, అహంకారంతో అక్కడ చక్రం తిప్పబోతున్న రాజకీయ పార్టీలతో చేతులు కలిపి బుద్ధులు కలిపి, ఆ పార్టీ గొడుగు క్రింద చేరి వారి జెండా ముసుగు పూర్తిగా కప్పుకోవడం ఎంతవరకు సబబు?

## భిన్నత్వంలో ఏకత్వం

మన తాత తండ్రుల కాలం నుంచి వస్తున్న ఈ భిన్న మతాలతో భిన్న సంస్కృతులతో విభిన్న భాషలతో మనల్ని భారతీయ అనే ఏకతాటిపై నడుపుతున్న ఏకత్వం ఏమైపోయింది? ఎవరికి వారే యమునా తీరే అంటూ రాజకీయ పార్టీల కండువా మార్చి మార్చి కప్పుకోగానే ఇలా గద్దెలనెక్కి కూడా వారి భావ పరంపరలను మార్చి మార్చి ప్రజలను వెర్రివారిని చేసి తమవెంట తిప్పుకోవాలని ప్రయత్నించడమే నేటి రాజకీయమా? ఎటువైపు తీసుకువెళ్ళాలని ఈ ప్రయత్నం? అసలు మన విభిన్న మతాలను, వారి భాషలను, సంస్కృతిని, ఏకత్వ సంస్కారాన్ని రాజకీయాలలో ఉపయోగించడం తప్పు అన్న విషయాన్ని మరచి ఏ ఒక్క సమస్యనైనా సనాతనం, మతం వైపునకు మరల్చి పరిపాలనను ఇదే అన్నట్టుగా చూపవద్దు అని నేటి రాజకీయ నాయకులకు వినతి. ఇట్టి మత గొడుగు క్రింద కుల కండువాలు కప్పుకుని ఇదే రాజకీయమని చూపే ప్రయత్నం చేసే నాయకులనుంచి మన రాబోయే తరాల వారు ఏమి నేర్చుకుంటారు? రాజకీయ మంటే త్యాగాల పరంపర' అని తెలిపిన వారినంతా దీని గురించి ఏమి అనుకోవాలి?

ఇంతటి సంక్షోభకర పరిస్థితులను కల్పిస్తున్నాం అని ఆలోచించే తీరిక లేకుండా సామాన్యప్రజలకు అవసరం అని భావించే కొత్త పథకాలు ఏమీ తెచ్చే ప్రయత్నాలు లేకుండా కేవలం మతం

ముసుగులు, మతం గొడుగుల క్రింద కాలం గడుపుకోవద్దని మరోసారి నేటి రాజకీయ నాయకులకు విన్నవించుకునే దుస్థితి. మహిళా రాజకీయ నాయకులకు విన్నవించుకునే దుస్థితి. మహిళా రాజకీయ నాయకులను చక్కని పదవులలో ఉంచి వారికి, దేశానికి కూడా వన్నె తెచ్చేలా సేవ చేయించిన రోజులెటు పోయాయి? నేటి మహిళా నాయకులు వేళ్ళ మీద మాత్రమే లెక్కించవచ్చు. వారిని కూడా పిచ్చి పిచ్చి గొడవలకు మధ్య వర్తులుగాను, అవతలి వారిని దూషించటానికి ఉపయోగించటం, వీడియోలలో మహిళలమని మరచి తిట్టుకోవటం, హద్దులు దాటి ఒకరి తప్పులు మరొకరు బయట పెట్టుకోవడం, ఇతరులు వీటిని వేరే వీడియోలలో వారి స్వంత జ్ఞానంతో విశ్లేషణ చేసి మళ్ళీ జనం ముందు ప్రయోగించడం ఇవే నిత్యం జరుగుతున్న యూట్యూబ్ యుద్ధాలు! ఏమిటి ఇదంతా? ఇదేనా మన భారతీయ సాంఘిక, సామాజిక, రాజకీయ సంస్కృతి?

ఇది కాదు మనందరి సంస్కారం. ఇది కాదు మనం కోరుకుని, ఎదురుచూసి మన ఓట్లతో కోరి తెచ్చుకున్న ప్రతినిధి రూపం. ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్నప్పుడు ఇచ్చిన మాటలు, చేసిన ప్రతిజ్ఞలు ఇవి కావుగా! ఓ మేమెన్నుకున్న మా ప్రియప్రజా ప్రతినిధులారా! ఏవో కొన్ని రాజకీయ పార్టీలకూటమి గొడుగు క్రింద చేరే మీకు మాత్రమే ఉపయోగపడే పనులు, మమ్మల్ని అణిచివేసే పనులు చేయమని మా ఓటు అనే వజ్రాయుధంతో మిమ్మల్ని అక్కడికి పంపలేదని ఒక్క నిమిషం ఆలోచించండి.

మనది కాని సంస్కృతిలోని పండుగలు, భావాలు తెచ్చి బలవంతంగా మాపై రుద్దమని మేము మా ఓటిచ్చి పంపలేదు. దయచేసి మతాలను వాటి రంగులను సామాన్య ప్రజలపై ప్రయోగించవద్దు అని కోరుకుంటున్నారు ప్రజలు. మన సమాజంలోని అన్ని రంగాలలో ఎన్నో సమస్యలు, లోటుపాట్లను సరిచేసే రాజకీయ నాయకుల్ని ఎన్నుకున్నామన్న ప్రజలు భ్రమల్ని భ్రమలుగానే మిగిల్చేస్తారా? సమాజ సేవ, సమాజ ప్రగతి కోసం మీరు ఏమి చేయాలనుకుంటున్నారో టీవీ వార్తల ద్వారా, వీడియోల ద్వారా చూపించటానికి ప్రయత్నం చేయండి.ప్రజలకు మీపైన నమ్మకం పెరుగుతుంది. కొన్ని కొన్ని పదాలకు విస్తృత అర్థాలు తెలుసుకుని ప్రచారానికి ఉపయోగించమని ప్రార్థన. ఆ పదాల అర్థాలను పూర్తిగా మార్చివేసే ప్రయత్నం వ్యర్థ ప్రయత్నమే అవుతుంది.

సనాతని, సనాతనం, సనాతన ధర్మం వంటివి చాలా విస్తృతార్థం కలిగిన పదాలు. అట్టి పదాలను 'మతం' పదాలుగా భావింప చేయవద్దు. మన దేశంలోని విభిన్న మతాలు తెలిపే సారాంశం ఒక్కటే. మతం అనే చక్కని సన్మార్గాల ద్వారా అందరం ప్రయాణించి ఆ భగవంతుని చేరుకోవడమే. కాని మధ్యలో రాజకీయ నాయకులు ఈ 'మతం' అర్థాన్ని, పరమార్థాన్ని మార్చి సామాన్య ప్రజల నడత, నడక మార్చి తమ స్వార్థ ప్రయోజనాలకు మతాన్ని ఉపయోగించవద్దు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని నయాన భయాన అణచివేతకు గురిచేయటం సబబు కాదని తెలుపుకోవడం, రాజకీయ కూటముల బారిన పడిన ప్రజలు వారి బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అసహజ పరిస్థితులు ప్రజలకు కలిగించవద్దు.

మీరు ఎన్నికల ముందు ఏ పార్టీ కండువాపై ఏ పార్టీ జెండా మోసి గెలిచారో మరువకండి. ప్రజలకు రాజకీయ నాయకులంటేనే ఏవగింపు కలిగే పరిస్థితులను కలిగించుకోకండి. ప్రజలు వారి విలువైన ఓట్లతో మీకు కలిగించిన పెద్దరికాన్ని నిలబెట్టుకోండి. మీ ముఠాతత్వాలతో, కూటమి రంగులతో ఊసరవెల్లులుగా మారిన ప్రతి ఒక్కరిని ఓటుతో గద్దెనెక్కించిన ఓటర్లే వెనక్కి రప్పించే హక్కును కూడా కలిగి ఉన్నారని మరువకండి. మహిళలు, చిన్నారులు, వారి సంక్షేమం గురించి మీరు ఏవిధంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నారో ఎప్పటికప్పుడు ప్రజలలోకి గౌరవంతో వచ్చి చెప్పి ఒప్పించగల పరిస్థితులలో మీరు, మీ పాలకులు ఉండండి. ఓటు ఎక్కే వరకు ఓడ మల్లన్న, ఓడ ఎక్కాక బోడి మల్లన్న' అన్న చందంగా ప్రవర్తించి ఓటిచ్చినవారిని బాధించకండి. మన భారత దేశ సంస్కృతిని, సంప్రదాయాలను బాధించే చర్యలకు పాల్పడి ప్రజల మద్దతును కోల్పోకండి.

✤




# అనుపమ

## రచయితలకు ఆహ్వానం

అనుపమ సమాజంలో నైతిక, సామాజిక మార్పు కోరుకునే మాసపత్రిక. సామాజిక, ధార్మిక, నైతిక, రాజకీయ అంశాలను రచించి తమ భావాలను లిఖితపూర్వకంగా వ్యక్తపరచగలిగే అవకాశం అనుపమ కల్పిస్తుంది. రచయితలు, రచయిత్రులు తమ అమూల్యమైన వ్యాసాలను వ్రాసి పంపాలని కోరుతున్నాం. పేపరుకు ఒకవైపు స్పష్టంగా అర్థమయ్యేలా రాయాలి. వ్యాసాలను ఎడిట్ చేసి ముద్రించే అధికారం సంపాదక వర్గానిదే.

- ఎడిటర్




మూలం : మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమ్రీ

తెలుగు రూపం : ఎస్. ఎమ్. మలిక్

## స్త్రీ సాక్ష్యం

ఇస్లామ్‌లోని సాక్ష్య చట్టం మీద ఓ ఆక్షేపణ. 'ఇందులో ఇద్దరు స్త్రీల సాక్ష్యం ఒక పురుషుని సాక్ష్యానికి సమానం. ఇది స్త్రీకి పరాభవం, ఆమె పట్ల అసమానత్వ వైఖరి.

ఇస్లామ్ అనేక వ్యవహారాలలో స్త్రీ పురుషుల సాక్ష్యం మధ్య వ్యత్యాసాన్ని పాటించింది. కాని దీన్ని స్త్రీ పట్ల పరాభవంగా భావించడం పూర్తిగా అన్యాయం, ఇస్లామ్ బోధనలకు వ్యతిరేకం. ఈ వ్యత్యాసం ఇస్లామ్ బలవంతాన సృష్టించలేదు. దీని కారణాలు స్వయాన స్త్రీ ప్రకృతి, ఆమె నైజం, ఆమె ఆచరణా పరిధిలోనే ఉన్నాయి. ఈ విషయంలో ఇస్లామ్ దృక్కోణాన్ని కాస్త వివరంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

ఇస్లామ్ సాక్ష్యాన్ని మూడు విధాలయినవిగా ఖరారు చేసింది.

## హుదూద్ (దైవం విధించిన శిక్షలు)లోనూ కిసాస్ (హత్యా ప్రతీకారం) లోనూ సాక్ష్యం

ఒక వ్యక్తికి హద్ద్ (దైవం విధించిన శిక్ష) విధించడానికి లేదా అతనిపై కిసాస్ (హత్యా ప్రతీకారం) తీర్చుకునేందుకు ఇద్దరు పురుషుల సాక్ష్యం అవసరం. అయితే వ్యభిచారానికి సాక్ష్యంగా నలుగురు పురుషులు తప్పనిసరి. ఈ సాక్ష్యం లేకుండా వ్యభిచారం నిరూపితం కాదు, హద్ద్ విధించబడదు. దివ్య ఖుర్ఆన్ వ్యభిచారానికి నిరూపణగా సాక్ష్యాన్ని ఈ ఆయత్‌లలో ప్రస్తావించింది-

**మీ స్త్రీలలో దుశ్చేష్టకు పాల్పడేవారికి వ్యతి రేకంగా మీలోని నలుగురి సాక్ష్యం తీసుకోండి.** ***(అన్ నిసా : 15)***

మరో చోట :

**మరెవరయితే శీలవతులయిన స్త్రీలపైన అపనింద మోపుతారో, ఆపైన నలుగురు సాక్షులను తీసుకురాకపోతారో, వారికి ఎనభయి కొరడా దెబ్బలు కొట్టాలి.** ***(అన్ నూర్: 4)***

ఈ ఆయత్‌లలో మీలోని 'నలుగురు పురుషులు, నలుగురు పురుషుల్ని సాక్షులుగా' అన్న పదాలు, వ్యభిచారానికి నిరూపణగా నలుగురు పురుషుల సాక్ష్యం అవసరం అని తెలుపుతున్నాయి. (ఇక్కడ ఓ ప్రశ్న. హత్య వంటి అపరాధానికి నిరూపణగా ఇద్దరు పురుషుల సాక్ష్యం సరిపోతే, మరి వ్యభిచారం నిరూపణకే నలుగురు పురుషుల సాక్ష్యం ఎందుకు అవసరమయింది? దీనికి సమాధానం ఇస్లామ్, సమాజంలో అశ్లీల ప్రచారం, ప్రస్తావనను ఇష్టపడదు, సమ్మతించదు. ఎవరయినా ఈ అపరాధానికి పాల్పడినా దాన్ని గుప్తపరచాలి, వ్యభిచారానికి శిక్ష, నలుగురు ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యమిచ్చినప్పుడే విధించాలి).

దీని భావమేమిటంటే హుదూద్‌లోనూ కిసాస్‌లోనూ కేవలం పురుషుల సాక్ష్యమే విశ్వసనీయమయింది. స్త్రీల సాక్ష్యం స్వీకరించబడదు. ప్రఖ్యాత అనుచరులు ఇమామ్ జుహ్రీ ఇలా

చెప్పారు, దైవ సందేశహరులు(స), హజ్రత్ అబూబక్ర్(రజి), హజ్రత్ ఉమర్(రజి)ల కాలంలో ఇదే సూత్రంపైన అమలు జరిగేది, ఆయన ఇంకా ఇలా అన్నారు :

**ప్రవక్త మహనీయులు(స) ఆయన తరువాత ఇద్దరు ఖలీఫాల (షేఖైన్) కాలం నుండి ఇది సున్నత్‌గా అలరారింది. హుదూద్, కిసాస్‌లలో స్త్రీల సాక్ష్యం స్వీకారయోగ్యం కాలేదు.** *(ఇబ్ను హజర్, అద్దిరాయతు ఫీ తఖ్‌రీజ్ అహాదీస్ అల్ హిదాయ : పుట.295)*

ఇస్లామ్, మానవుని ప్రాణం, మానం, ధనం, అభిమానం ఇత్యాది వాటి పరిరక్షణ కొరకు దైవం నిర్ణయించిన శిక్షలు, హత్యా ప్రతీ కారం (హుదూద్, కిసాస్) నిర్ణయించింది. ఎవరయినా మరొకరి ప్రాణాలు తీస్తే (హత్య చేస్తే) అతని ప్రాణాలు తీయడం జరుగు తుంది. అవివాహితుడు వ్యభిచరిస్తే అతనికి వంద కొరడా దెబ్బలు వెయ్యబడతాయి. ఇదే నేరం వివాహితుడు చేసినట్లయితే రాళ్ళతో కొట్టి చంపడం జరుగుతుంది. దొంగతనం చేసినట్లు రుజువయితే దొంగ చెయ్యి నరికివెయ్య బడుతుంది. అప నిందకు, మద్యపాన సేవనానికి కఠిన శిక్షలు విధించబడతాయి. ఏ అపరాధాలకు ఇస్లామ్‌లో హుదూద్ (దైవం నిర్ణయించిన శిక్షలు) లేదా కిసాస్ (ప్రతీకారం) ఆదేశాలున్నాయో అవి ఎంతో ఘాతుకమయిన నేరాలు. ఆ నేరాలకు పాల్పడిన వ్యక్తి బ్రతికి ఉన్నా సమాజంలో అతని ప్రతిష్ఠ బాగా దెబ్బతిని ఉంటుంది. అతనికి ఎటువంటి గౌరవమర్యాదలు ప్రాప్తం కావు. ఈ అపరాధా లకు స్త్రీల సాక్ష్యం స్వీకరించకపోవడానికి కారణం ఈ అపరాధాల ఈ ప్రత్యేక లక్షణాలే బాహ్యంలో గోచరిస్తున్నాయి. స్త్రీ వాస్తవానికి ఇంటి యజమానురాలు, ఆమె మనస్తత్వం, నైజం ఓ ప్రత్యేక మూసలో మలచబడి ఉంటుంది. ఓ ప్రత్యేక వాతావరణంలో పెరిగి, పెంచబడి, తర్ఫీదు పొంది ఉంటుంది. ఈ భయంకర అపరాధాలు జరిగే పరిస్థితులు, కారణాలు వగైరా ఆమెకు సాధారణతః ఎప్పుడూ ఎదురయి ఉండవు. అందువల్ల ఆమెకు వాటి గురించి ఆమెకు తెలిసిన సమాచారం, పరిశీలన, ఆమెకు గల ప్రత్యక్ష జ్ఞానం, బహు స్వల్పం. అది పురుషునిలా పరిపూర్ణం కాజాలదు. ఇంకా స్త్రీలో సహజమయిన మార్దవం, అనుభూతిలోని తీవ్రత వల్ల వ్యక్తిగత లేదా సామూహిక హత్య, హత్యలు, దొంగతనాలు, లూటీ, మానభంగాలు తదితర భయంకర నేరాలను సవివరంగా పరిశీలించడం, వాటిని పూర్తిగా స్మృతిపథంలో భద్రపరచుకోవడం, ఆ తరువాత వాటిని తు.చ తప్పకుండా న్యాయస్థానాల సమక్షంలో వల్లె వెయ్యడం సులువయిన పనికాదు. ఈ వ్యవహారాలలో న్యాయస్థానాలకు పురుషుని వాంగ్మూలం వల్ల కలిగే నమ్మకం, విశ్వసనీయత స్త్రీల వాంగ్మూలాల వల్ల కలగదు. వాటిలోనూ అనుమానం, శంక, అధికంగానే మిగిలిపోతాయి. ఇస్లామ్ ఆదేశం ప్రకారం గట్టి ఆధారాలు, సాక్ష్యాధారాలు, నిరూపణలు లేనిదే హుదూద్‌పైన అమలు జరగరాదు. వీలయినంతవరకు ఆరోపిని రక్షించే మార్గం చూడాలి. దైవసందేశహరులు (స) ఇలా సెలవిచ్చారు :

**వీలయినంతవరకు ముస్లిముల నుండి హుదూద్ (దైవం నిర్ణయించిన శిక్ష)లను దూరం చెయ్యండి.** *(తిర్మిజీ, అబ్వాబుల్ హుదూద్. ఈ ఉల్లేఖనం మర్ఫూ, మౌకూఫ్ రెండు విధాలా వచ్చింది. ఇమామ్ తిర్మిజీ ప్రకారం ఇది మౌకూఫ్ అయిన మాట వాస్తవమే)*

మరో హదీసు ప్రకారం, అనుమానం ఉన్నచోట హుదూద్ పైన అమలు జరపరాదు.

అనుమానాలున్న చోట హుదూద్‌ను దాటవేయండి. (ఈ హదీసు ప్రామాణికంగా బలహీనమయింది. అయితే అనేక ప్రమాణాల ద్వారా ఉల్లేఖించ బడింది. అందువల్ల వాదనకు తగినదే- నైలుల్ ఔతార్ : 7/272)

కొందరు స్త్రీల ప్రత్యక్ష పరిశీలన, హత్య, దొంగతనం, లూటీ, మాన భంగాలు వంటి భయంకర వృత్తాంతాలలోనూ విశ్వసనీయంగా పరిగణించ వీలుంటుంది, వారు న్యాయస్థానాల సమక్షంలో వాటిని వివరించనూగలరు. కాని స్త్రీగా ప్రతి స్త్రీ దాన్ని భరించలేదు. అందువల్ల స్త్రీ జాతి గురించి నిర్ణయం గైకొనవలసి వచ్చినప్పుడు వారిలో కొందరిని మాత్రమే కాదు మొత్తాన్ని దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది.

## హక్కులు, ఇతర వ్యవహారాలలో సాక్ష్యం

హుదూద్, కిసాస్‌లో తప్ప ఇతర హక్కులూ వ్యవహారాలలో స్త్రీ సాక్ష్యాన్ని స్వీకరించడం జరుగుతుంది. దీనికి ఓ కారణం హుదూద్, కిసాస్‌లకున్న ప్రాముఖ్యత ఇతర వ్యవహారాలకు లేదు. మరో విషయమేమంటే వాటి సంబంధం దైనందిన వ్యవహారా లకు సంబంధించింది. స్త్రీ కార్యరంగం ఇల్లే అయినప్పటికీ ఈ వ్యవహారాలు ఆమెకు నిరంతరం ఎదురవుతూనే ఉంటాయి. అయితే స్త్రీకి సంబంధించిన కొన్ని ప్రత్యేక పరిస్థితుల రీత్యా, మరికొన్ని సహజ బలహీనతల దృష్ట్యా రెండు చర్యలు గైకొన బడ్డాయి. ఒకటి, ఏదయినా వ్యవహారాన్ని కేవలం స్త్రీల సాక్ష్యా ధారంగా నిర్ధారించరాదు. దానికి బదులు ఇద్దరు పురుషులు ఏ వ్యవహారానికయినా దాని పక్షాన సాక్షులుగా ఉన్నప్పుడు లేదా కనీసం ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్ష్యం ఇచ్చిన పక్షంలో ఆ వ్యవహారంలో తీర్పు చెయ్యాలి అని నిర్ధారించడం జరిగింది. ఓ పురుషుని స్థానంలో స్త్రీలు ఇద్దరు అవసరమనడానికి కారణంగా కుర్‌ఆన్ చెప్పింది ఏమిటంటే సంఘటనకు సంబం ధించిన వివరాలు స్త్రీ మరచిపోగలదు. ఒక స్త్రీ మరచిపోతే మరో స్త్రీ ఆమెకు దాన్ని గుర్తు చేస్తుంది. ఇలా సెలవీయడం జరిగింది:

**ఇంకా, మీ పురుషుల్లో ఇద్దరిని దానికి సాక్షులుగా ఏర్పరచుకోండి. ఇద్దరు పురుషులు లేనిపక్షంలో, ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలు కావాలి. వారి సాక్ష్యం మీకు ఆమోదయోగ్య మయినది కాగలగాలి. వారుభయుల్లో ఒకామె పొరబడినా మరొకామె గుర్తు చెయ్యడానికి.** ***(అల్ బకర : 282)***

ఆయత్ ద్వారా ఓ అనుమానం కలుగుతుంది; పురుషుడు లేనప్పుడే స్త్రీల సాక్ష్యం స్వీకారయోగ్యమవుతుందేమో అని అనుమానం కలుగుతుంది. కాని ఈ అనుమానం సరయినది కాదు. దీని భావం కేవలం ఒక్కటే. సాక్షులుగా ఇద్దరు పురుషులయినా ఉండాలి, లేదా ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలయినా ఉండాలి.

ఏ వ్యవహారాలలో స్త్రీకి సాక్ష్యం ఇచ్చే అధికారముందో వాటిలో పురుషులున్నా ఒక పురుషుడూ ఇద్దరు స్త్రీల సాక్ష్యాన్ని స్వీకరించడం జరుగుతుంది.

ఈ ఆయత్ ద్వారా, స్త్రీల సాక్ష్యం వేర్వేరుగాకాక ఇద్దరి సాక్ష్యం ఒకేసారి తీసుకోవడం జరుగుతుందని వాదనాధారం గ్రహించడం జరిగింది. సాక్ష్యమిచ్చే టప్పుడు ఇద్దరూ కలిసి ఉంటారు. అప్పుడే ఒకామె మరచిపోయిన దాన్ని మరొకామె జ్ఞాపకం చెయ్యడం సాధ్యమవుతుంది. *(ఫత్‌హుల్ బారీ : 5/ 169)*

చర్చలోని ఆయత్ ఋణం విషయంలో వచ్చింది. అందువల్ల సర్వసామాన్యంగా ఇందులో ధర్మవేత్తలందరి ఏకాభిప్రాయముంది, అప్పుడు లావాదేవీలోనూ, ఆర్థిక వ్యవహారాలలోనూ స్త్రీసాక్ష్యం స్వీకారయోగ్యమేనని. *(ఫత్‌హుల్ బారీ : 5/ 168)*

హనఫీ ధర్మవేత్తల అభిప్రాయంలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీల సాక్ష్యం కేవలం హుదూద్‌లోనూ, కిసాస్‌లో మాత్రమే స్వీకారయోగ్యం కాదు. అదే తప్ప వాణిజ్య వ్యాపారాలు, అప్పు, ఆర్థిక లావాదేవీలు, చేబదుళ్ళు, గుత్త, అప్పగింత, నికాహ్ (వివాహం), వకాలత్ (ఒకరి పక్షాన బాధ్యతతో కార్యనిర్వహణ చేయడం), తలాక్(విడాకులు), వసీయత్ (వీలు), విరాసత్ (వారసత్వం), ఇత్యాది విషయాలన్నిం టిలో, హక్కులు, వ్యవహారాలలో స్త్రీల సాక్ష్యం స్వీకారయోగ్యమయినదే.

దీనికి వాదనాధారంగా ఇలా చెప్పడం జరిగింది. సాక్ష్యానికి మూడు విషయాలు అవసరం. ఒకటి, సంఘటనను సరిగ్గా పరిశీలించి ఉండాలి. రెండు, దాన్ని పూర్తిగా జ్ఞాపకం ఉంచుకోవాలి. మూడు, దాన్ని యధాతథంగా వప్పజెప్పాలి. స్త్రీ బలహీనతను కుర్‌ఆన్ ఈ విధంగా వర్ణించింది. ఆమె వివరాలు మరచిపోగలదు. ఈ కొరతను ఓ స్త్రీకి బదులు ఇద్దరు స్త్రీలను పెట్టి పూరించడం జరిగింది. అందువల్ల హుదూద్ (దైవం విధించిన శిక్షలు), కిసాస్ (ప్రతీకారం) తప్ప ఇతర వ్యవహారాలలో ఆమె సాక్ష్యాన్ని ఆమోదయోగ్యం చెయ్యడం అవసరం.

ఇప్పుడు ఓ ప్రశ్న, ఇద్దరు స్త్రీల సాక్ష్యం ఓ పురుషుని సాక్ష్యానికి సమానమయి నట్లయితే ఏ వ్యవహారాలలో ఇద్దరు పురుషుల సాక్ష్యాధారంగా తీర్పు జరుగుతుందో ఆ వ్యవహారాలలో నలుగురు స్త్రీల సాక్ష్యంమీద కూడా తీర్పు జరగడం న్యాయసమ్మతం కావాలి కదా? దీనికి ఫిక్హ్ వేత్తలు ఇలా సమాధానమిచ్చారు: హేతుబద్ధంగా ఈ మాట సరయినదే. కాని దీన్ని న్యాయబద్ధం చేసినట్లయితే స్త్రీలు ఇంటి బయట రాకపోకలు బాగా పెరిగిపోతాయి. కాని షరీఅత్ ఉద్దేశం, వారు ఇంటిపట్టున ఉండాలన్నది. *(హిదాయ : 3/154 మఅ షురుహ్ హిదాయ)* ఎందుకంటే దీనివల్ల జనించే కీడులు చాలా ప్రమాదభరితమయినవి. (నేడు మనం వాటిని అనుభవ పూర్వకంగా అందరమూ చూస్తున్నాము)

## మహిళల ప్రత్యేక సమస్యలలో సాక్ష్యం

ఈ విషయంలో ధర్మవేత్తల ఏకాభిప్రాయం ఉంది. స్త్రీలకు చెందిన ప్రత్యేక వ్యవహారాలలో స్త్రీల సాక్ష్యం మాత్రమే సరిపోతుంది. ఉదాహరణకు ప్రసవ సమయంలో శిశువు జీవితానికి సంబంధించిన సాక్ష్యం. పుట్టడం సజీవంగా పుట్టినట్లయితే దాని జనాజా నమాజ్ ఆచరించడం అవసరం, దానికి సంబంధించిన వారసత్వపు ఆదేశాలను అమలుపరచడం అవసరమవుతుంది లేకపోతే లేదు. అలాగే ఒక స్త్రీ రజస్వలా, కాదా? కన్యయేనా కాదా? అన్న విషయాల సాక్ష్యం. అలాగే స్త్రీ ప్రత్యేక లైంగిక లోపాలు, వ్యాధులకు సంబంధించిన సాక్ష్యం. ఈ విషయాలన్నీ కొన్ని సందర్భాలలో నికాహ్ తదితర సంబంధిత వ్యవహారాలలో ప్రభావం వేస్తాయి. (కొన్ని వివరాలలో ధర్మవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. ఇక్కడ వాటిని గురించి చర్చించడం లేదు).

ఈ విషయంలో ఇమామ్ జుహ్రీ ఇలా అంటున్నారు :

సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) ఏమిటంటే (కేవలం) స్త్రీల సాక్ష్యం అన్నది, వారు తప్ప ఇతరులు ఎరుగని వ్యవహారాలలో మాత్రమే ధర్మసమ్మతం. అంటే ప్రసవ సమయం, అప్పటి పరిస్థితులు, లేదా స్త్రీలకు సంబంధించిన లోటుపాట్లు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజి), హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్, హజ్రత్ ఉర్వా బిన్ జుబైర్ అభిప్రాయాలు కూడా దీన్ని బలపరుస్తున్నాయి. హజ్రత్ అలీ(రజి) కూడా ఒక దాయ (మంత్రసాని) సాక్ష్యం ఆధారంగా ఒక తీర్పు చేసినట్లు ఉల్లేఖనాలున్నాయి. అలాగే హజ్రత్ ఉమర్(రజి) కూడా ఒక మంత్రసాని సాక్ష్యాన్ని, పిల్లవాడు సజీవంగా పుట్టాడన్న దాన్ని స్వీకరించారు. *(అద్ దిరాయ ఫీ తఖ్రీజ్ అహాదీస్ అల్ హిదాయ : పుట 295)*

స్త్రీల ప్రత్యేక సమస్యల్లో ఎందరు స్త్రీల సాక్ష్యం అవసరమవుతుంది అన్న విషయంలో ధర్మవేత్తల మధ్య భేదాభిప్రాయముంది. సాధారణంగా దీనికి నలుగురు స్త్రీలు అవసరమని నిర్ధారించి పెట్టారు. కాని ఇమామ్ మాలిక్, ఇబ్ను అబీ లైలా ప్రకారం ఇందులో ఇద్దరు స్త్రీల సాక్ష్యంపైనే తీర్పు జరుగుతుంది. ఇమామ్ సౌరీ, హనఫీ ఉలమాల దృష్టిలో ఒక్క స్త్రీ సాక్ష్యం కూడా సరిపోతుంది. *(ఫత్‌హుల్ బారీ: 5/ 168, 169)*

హనఫీ ధర్మవేత్తలు తమ అభిప్రాయానికి రెండు వాదనాధారాలు చూపారు; ఒకటి, పైఉల్లేఖనంలో సంఖ్య ఏదీ నిర్బంధించలేదు, అందువల్ల ఒక్క స్త్రీ సాక్ష్యమయినా సరిపోవలసి ఉంటుంది. రెండు, స్త్రీల ప్రత్యేక సమస్యలలో కేవలం స్త్రీల సాక్ష్యమే సరిపోతుందనడానికి, పురుషుని సాక్ష్యం అవసరమనడానికి కారణం, స్త్రీల గోప్య స్థానాలు మరో స్త్రీ చూడటంలోగల దౌష్ట్యం కన్నా పురుషుడు చూడటంలో గల దౌష్ట్యం అధికం. ఇదే ఆధారంగా ఒక స్త్రీ పరిశీలించడం కన్నా అధిక స్త్రీలు పరిశీలించడంలో మరీ అధిక దోషం ఉందని అనవచ్చు. అయినప్పటికీ దీనితోపాటు జాగ్రత్త కోసం ఒకరు కన్నా అధికంగా స్త్రీల సాక్ష్యమే మంచిదని చెప్పడం జరిగింది *(హిదాయ : 3/154. స్త్రీ సాక్ష్యం విషయంలో ఇస్లామ్ దృక్కోణాన్ని విశదంగా తెలుసుకునేందుకు రచయిత ఉర్దూ పుస్తకం : 'ఔరత్- ఇస్లామీ ముఆషిరామే!' చూడగలరు)*

# నైతికతే నిజమైన స్వేచ్ఛ

- మిన్హాజ్ నాజిమా

విలువలను కాలరాసిన సమాజపు పోకడ
నిస్తేజపు దుస్థితినీ ఎవరు ఏమి మార్చరా???

ప్రేమ, ఆప్యాయత, పలకరింపు అసలురా...
డబ్బు, దర్పము, అధికారం ఎప్పటికీ నిలవదురా.

చందమామ రావే అని చెంతచేరి పలుకరించే...
పక్కింట్లో ప్రాణం పోయినా తెలిసిరాని బతుకురా.

ప్రాణాలను లెక్కించని కార్పొరేట్ వైద్యమాయే....
పెట్టిన పెట్టుబడికి కూడగట్టే ప్రయత్నమాయే.

అలనాటి మమకార ఆతిథ్యాలు నేడు కరువాయే....
ఒకరిని మించి ఒకరు ఎదగాలని అత్యాశయాయే.

ప్రశాంతత కరువైన వెలుగులీను విల్లాలో....
చీకటి బతుకులు వెళ్ళదీసే జీవిత గమన మాయే.

నవ మాసాలు మోసిన కన్నపేగు బంధాన్ని విస్మరించే....
తల్లిదండ్రుల బతుకులు వృద్ధాశ్రమ పాలాయే.

కటిక సమాజంలో అమ్మాయిల బతుకులు ఆగమాయే....
ఎటు వెళ్లిన చీల్చిచెండాడే నరరూప రాక్షసులాయే.

బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన దుస్థితి స్త్రీకి ఎదురాయే....
మానవత్వం మంటగలిపే మనిషి బతుకు జంతువు కన్న హీనమాయే.

బోసినవ్వుల పసి బాల్యం స్మార్ట్ ఫోన్ పాలాయే....
ఇంట్లో కథలను చెప్పే నానమ్మ తాతయ్యలు లేరాయే

ప్రాణాలు గాల్లో కలుస్తున్న రీలు చేయడం ముఖ్యమాయే....
చేసిన చిన్న సహాయానికి పది ఫోటోలతో ప్రచారమాయే.

నిస్తేజపు దుస్థితిని ఎవరు ఏమి మార్చరా???
మనమే మార్చాలయా.... మనమే సరిదిద్దాలయ....

“నైతికతే నిజమైన స్వేచ్ఛ”ని గుర్తెరిగి నడవాలయ్యా
తల్లిగా,చెల్లిగా, పుత్రికగా, ఇల్లాలిగా స్త్రీని ఆదరించాలయ్యా.

“స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం” అని రాయవలసిన దుస్థితి తేకయ్యా.
మొదటి చూపు క్షమార్హమని, రెండవ చూపు శిక్షార్హమని.

చూపులను ఎక్కడపడితే అక్కడ వాల్చకుండా జాగ్రత్త పడమంటుందయ్యా
తమ నాలుకను, మర్మాంగాలను కాపాడుకున్న వారికి స్వర్గపు పూచికత్తు అందించబడిందయ్యా.

“తల్లి పాదాల కింద స్వర్గం ఉంది, తండ్రి స్వర్గ ద్వారాలలో ఒక ద్వారం” అన్న విషయాన్ని ఎందుకు మరిచావయ్యా.
పుట్టగొడుగుల్లా వెలిసిన వృద్ధాశ్రమ కుసంస్కృతిని కాలదన్ని....
ప్రేమ ఆప్యాయత కోసం తల్లడిల్లే తల్లిదండ్రులను అక్కున చేర్చుకోవయ్యా.

వాట్సప్,ఫేస్బుక్ స్నేహాలకు గుడ్ బై చెప్పి...
చిన్ననాటి స్నేహితులతో మనసు విప్పి మాట్లాడవయ్యా.

“పొరుగువారు ఆకలితో ఉండగా కడుపునిండా భుజించి ఆదమర్చి పడుకునే వారు అసలు ముస్లిం కాదయ్యా”
కష్టాల్లో ఉన్నవారికి నేనున్నాను అని భరోసా ఇయ్యవయ్యా.

మానవత్వ పరిమళాలు తిరిగి గుభాళించవయ్యా.
నీవు, నీ పుట్టుక అప్పుడే సార్థకమగునయ్యా....

# పాలక్ చికెన్

చికెన్ - 200 గ్రా.

ఉల్లిపాయలు - 2
జీడిపప్పు - 50 గ్రా.
గరం మసాలా - ఒక టీ స్పూన్
పసుపు- ఒక టీ స్పూన్
కారం - టీ స్పూన్
దనియాల పొడి - ఒక టీ స్పూన్
పాల కూర - 2 కట్టలు
క్రీము- టేబుల్ స్పూన్
వెన్న - టేబుల్ స్పూన్
నూనె- సరిపడా
ఉప్పు - సరిపడా



పాల కూరను కడిగి వేడినీళ్ళలో ఓ నిమిషం వేసి తీయాలి. తరువాత మిక్సీలో వేసి గుజ్జులా చేయాలి.

జీడిపప్పుల్ని చిన్న ముక్కలుగా చేయాలి.

బాణలిలో నూనె వేసి వేడి చేయాలి. కాగాక సన్నగా తరిగిన ఉల్లిముక్కల్ని వేసి వేయించాలి.

తరువాత జీడిపప్పు ముక్కలు, ధనియాల పొడి, పసుపు, కారం, గరం మసాలా వేసి వేయించాలి.

వేగాక పాలకూర గుజ్జు వేసి కలపాలి. ఇప్పుడు చికెన్ ముక్కలు, ఉప్పు వేసి కలపాలి. తరువాత వెన్న, క్రీము వేసి మూత పెట్టి సిమ్‌లో ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికిన తరువాత దించి రోటీతో వడ్డిస్తే సరి...

# చికెన్ పకోడి

స్కిన్‌లెస్, బోన్ లెస్ చికెన్ - అర కిలో
ఉల్లిపాయలు - 1
పెరుగు - ఒక కప్పు
పచ్చిమిర్చి- 2
అల్లం వెల్లుల్లి - ఒక టీ స్పూను
జీలకర్ర పొడి- ఒక టీ స్పూన్
నిమ్మరసం- ఒక టీ స్పూన్
వెనిగర్ - రెండు టీ స్పూన్
నూనె- సరిపడా



ఉల్లిపాయల్ని, పచ్చిమిర్చిని సన్నగా తరగాలి.

- చికెన్ ముక్కలు తప్ప మిగిలనవన్నీ ఒక గిన్నెలో వేసి బాగా గిలకొట్టినట్టుగా కలపాలి. తరువాత అందులో చికెన్ ముక్కలు వేసి ఆ మిశ్రమాన్ని బాగా పట్టేటట్టుగా చేయాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఫ్రీజ్‌లో 40 నిమిషాలు పెట్టాలి.

- తరువాత బయటకు తీసి కాగిన నూనెలో ఎర్రగా వేయించి తీయాలి. వీటిని కొత్తిమీర లేదా పుదీన చట్నీతో అందిస్తే సరి.

Edited, Printed & Published by Sultan Mohiuddin Mallick on behalf of Telugu Islamic Publications, Printed at Cosmic Printers,
22-8-584/6, Lakkadkot, Chatta Bazar, Hyderabad-2, RNI APTEL/2012/47740, Postal Concessional Regn. No. HSE/1006/2023-2025 ; Ph. 040 - 24576237